ప్రజాశక్తి




జీతం ఇంకా రాలేదు..!

- ఉద్యోగుల జీతాలు, పెన్షన్ల చెల్లింపులో ఆలస్యం
- ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఉద్యోగులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు, పెన్షనర్లకు పెన్షన్ల చెల్లింపులు నెల నెలకూ ఆలస్యం అవుతూనే ఉన్నాయి. జనవరి నెల వేతనం ఇప్పటి వరకూ జమ కాలేదు. ప్రభుత్వం సకాలంలో వేతనాలు, పెన్షన్లను చెల్లించలేకపోవడంపై ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది...

జిల్లాలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ జీతాల కోసం, పెన్షనర్లు పెన్షన్ల కోసం ప్రతి నెలా ఎదురు చూడాల్సి వస్తోంది. సకాలంలో అవి అందక, ఇఎంఐలు చెల్లించలేక, ఇతర అవసరాలు తీర్చుకోలేక అల్లాడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 45 వేల మంది ఉద్యోగులు, 15 వేల మంది ఉపాధ్యాయులు, 5 వేల మంది పెన్షనర్లు ఉన్నారు. గత నెల 10వ తేదీ తరువాత వేతనాలు, పెన్షన్లను ఖాతాల్లో జమ చేశారు. చాలా మందికి ఇప్పటి వరకూ జనవరి నెల వేతనం తమ ఖాతాల్లో జమ కాలేదు. రెవెన్యూ, వైద్య శాఖలో కొందరికి, గ్రామ సచివాలయ ఉద్యోగులకు మాత్రం వేతనం జమ అయింది. అందరికీ చెల్లింపులు పూర్తయ్యేసరికి ఈ నెల 15వ తేదీ దాటుతుందనేది అంచనా. సాధారణంగా వేస్ అండ్ మీన్స్, ప్రత్యేక డ్రాయింగ్ సదుపాయం, ఓవర్ డ్రాఫ్ట్ సౌలభ్యం పేరిట రాష్ట్రం అప్పుల వెసులుబాటు వినియోగించుకుంటూ ఉంటుంది. ఓవర్ డ్రాఫ్ట్ పేరుతో



వినియోగించుకోదగ్గ మొత్తమూ అంతంతే. పైగా నిర్దిష్ట గడువులోగా వాటిని తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. అందులోనూ ఇబ్బందులు ఉన్నాయి. రాష్ట్రంలో ఇంకా రూ.2,900 కోట్లు పింఛన్లు, జీతాలు కలిపి చెల్లించాలి. రాష్ట్ర ప్రభుత్వం బహిరంగ మార్కెట్లో రుణం తీసుకోవాలంటే దానికీ పరిమితులు ఉన్నాయి. ఇప్పటికే ఎపి తన పరిమితిని దాటేసింది. అంటే ఈ నెల అప్పు కూడా పుట్టదు. మరో వైపు కార్పొరేషన్ల నుంచి రుణం తీసుకునే అవకాశమూ లేదు. ఈ నెల ప్రారంభంలో రూ.2,000 కోట్లను ఏదో కార్పొరేషన్ పేరిట బ్యాంకుల నుంచి అప్పు తీసుకుని, రాష్ట్ర అవస రాల కోసం సర్దుబాటు చేసేశారు. ఇప్పటికే మద్యం సొమ్ముల పేరుతో రూ.8,300 కోట్లు, ఇతరత్రా కార్పొరేషన్ల పేరుతో మరో రూ.12,000 కోట్ల రుణాలు ప్రభుత్వం వినియోగించుకున్నట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో ఇతరత్రా అవసరాలు పోను రోజువారీ రాబడిలో ఎంత మొత్తం జీతాలకు, పింఛన్లకు చెల్లిస్తారనే అంశంపైనే నవంబరు జీతాలన్నీ ఎప్పటికి చెల్లించగలరో తేలనుంది. గత నెల 10వ తేదీ పైన వేతనాలు పడటం, ఈ నెల కూడా ఆలస్యం అవుతుండటంతో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

- కలెక్టర్ కోటేశ్వరరావు

ప్రజాశక్తి-పత్తికొండ

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలంటే చదువే మూలమని, అందుకోసం విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టపడి చదవాలి జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. పత్తికొండ మండలం కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మోటివేషన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి విద్యార్థులను చదివిస్తున్నారని, దానిని విద్యార్థులు గుర్తించుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు ఆకర్షితులు కాకుండా మంచి మార్గంలో పయనించి ఉన్నత లక్ష్యాలు సాధించాలన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో వారు సాధించే లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని అందుకు అనుగుణంగా కృషి చేయాలన్నారు. ఏ ఒక్క విద్యార్థి ఫెయిల్ కాకుండా ఉన్నత లక్ష్యాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ఒక ప్రణాళిక రూపొందించి శిక్షణ ఇస్తారన్నారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు మార్చి 1 నుంచి సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహించాలన్నారు. విద్యార్థులు తమకంటే ఉన్నతంగా చదువుతున్న విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని వారి స్థాయికి చేరుకునేలా ప్రయత్నించాలన్నారు. ముఖ్యంగా ఎటువంటి ప్రలోభాలకు లోనవ్వకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చూపిన మార్గంలో నడవాలన్నారు. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారను. అదే విధంగా విద్యార్థి దశలో పదవ తరగతి అనేది చాలా కీలకమైందని, దానిని అధిగమించడంతో ఉన్నత చదువులు చదివేందుకు అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ పదవ తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు చదువు ప్రాముఖ్యత, చదువుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను గురించి వక్తలు వివరించారు.. విద్యార్థులతో కూడా మాట్లాడించారు. పత్తికొండ ఆర్‌డిఒ మోహన్ దాస్, మోటివేషనల్ స్పీకర్ రంగబాబు, ఎస్ఎస్ఎ పిఒ వేణుగోపాల్, పత్తికొండ తహశీల్దార్ విష్ణుప్రసాద్, ప్రధానోపాధ్యాయులు మస్తాన్ వలీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు పాదయాత్ర

- పశ్చిమ రాయలసీమ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ఈనెల 15వ తేదీ నుండి అన్ని జిల్లా కేంద్రాల్లో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు పశ్చిమ రాయలసీమ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు, నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగాలు కావలని, ఉద్యోగులకు, ఉపాద్యాయులకు, ప్రభుత్వ వేధింపులు ఆపాలన్నారు. రాయలసీమ జిల్లాల్లో అభివద్ధి, కాంట్రాక్ట్ ఉద్యోగుల ను రెగ్యులర్ చేయాలన్నారు. కొత్త డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల తో పాటు విశ్వవిద్యాలయాలలో ఖాళీ గా ఉన్న అధ్యాపకుల పోస్టు లను భర్తీ చేయాలన్నారు., జూనియర్, డిగ్రీ కాలేజ్ లెక్చరర్ పోస్టు లను భర్తీ కేజీబీవీ ఉద్యోగుల వేతనాలు పెంచాలని, వారి ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. , రాయలసీమ జిల్లాలకు సాగునీటి, తాగునీటి అవసరాలకు జిల్లా కు 100 టీఎంసీ ల నికర జలాలను కేటాయింపులు చేయాలన్నారు., ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను కూడా ఆయా వర్గాలకే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఈ పాదయాత్ర 15 నుండి ప్రతి జిల్లా కేంద్రంలోనూ మహాత్మా గాంధీ విగ్రహం నుంచి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహం వరకు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ పాదయాత్ర శాంతి యుతంగా చేపట్టేందుకు సహకరించాలని ఆయన కోరారు.

సిటీ ప్లానర్‌పై వేటు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థ సిటీ ప్లానర్ పి.ప్రదీప్ కుమార్‌పై ప్రభుత్వం వేటు వేసింది. సిటీ ప్లానర్‌గా ఆయన సేవలను ఉపసంహరిస్తూ రాష్ట్ర టౌన్ ప్లానింగ్ విభాగం డైరెక్టర్ విద్యుల్లత బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పి.ప్రదీప్ కుమార్‌ను తక్షణమే రిలీవ్ చేసి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అంతర్గత ఏర్పాట్లు చేసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డైరెక్టర్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ప్రదీప్ కుమార్‌ను ఆదేశించారు.

కర్నూలు న్యాయ విశ్వవిద్యాలయం

- నంద్యాల, కర్నూలు జిల్లాల్లో పవర్ ప్రాజెక్ట్ - రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలులో జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోద ముద్ర వేసింది. అమరావతి సచివాలయంలో బుధవారం సమావేశమైన ఎపి మంత్రి మండలి పలు నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. నంద్యాల, కర్నూలు జిల్లాల్లో సోలార్, విండ్ ప్రాజెక్టులకు అనుమతినిస్తూ తీర్మానించింది. ఎకోరెన్ సంస్థ ఒక్కో ప్రాజెక్టును దశల వారీగా వెయ్యి మెగా వాట్ల సామర్థ్యంతో వీటిని ఏర్పాటు చేయనుంది. 2027 నాటికి ఈ ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి కానుంది. నంద్యాల జిల్లా డోన్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బోధనా సిబ్బంది నియామకానికి మంత్రి మండలి ఆమోదం తెలిపింది. కొత్తగా ఏర్పడిన నంద్యాల జిల్లా కేంద్రాన్ని రెండు మండలాలుగా విభజిస్తూ నూతనంగా రూరల్ మండలాన్ని ఏర్పాటు చేసేందుకు ఆమోదముద్ర వేసింది. 1998 డిఎస్సీకి ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగ్ ఇచ్చేందుకు మంత్రిమండలి అంగీకారం తెలిపింది. వీటితో పాటు పలు సంక్షేమ పథకాలకు ఆమోదం తెలిపింది.

డిఎస్‌సి 98 ఉపాధ్యాయులకు పోస్టులు భర్తీ

- ఆమోదముద్ర వేసిన రాష్ట్ర మంత్రి మండలి
- జిల్లాలో 625 మందికి నియామకాలు

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నటువంటి డిఎస్‌సి 98 ఉపాధ్యాయులకు ఎస్‌జిటి కింద పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ కింద పోస్టులు కల్పించాలని రాష్ట్ర మంత్రిమండలి బుధవారం ఆమోదముద్ర వేసింది. మార్చి మొదటి వారంలో వారికి పోస్టింగుల ఉత్తర్వులు ఇచ్చేందుకు అవకాశం ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో మొత్తం 625 మంది డిఎస్‌సి 98 కింద ఉపాధ్యాయ పోస్టులకు అర్హత సాధించారు. గత ఏడాది సెప్టెంబర్లో 98 అభ్యర్థులకు పోస్టింగులు కల్పించేందుకు అర్హత ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తి చేశారు. ఇటీవల జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు , ఎస్‌జిటిలకు తాత్కాలికంగా స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతుల ప్రక్రియను విద్యాశాఖ పూర్తి చేసింది. ఇందులో భాగంగా దాదాపుగా పెద్ద ఎత్తున పాఠశాలల్లో ఎస్‌జిటి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టులలో 98 మంది అభ్యర్థులకు పోస్టింగ్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటివరకు పోస్టుల భర్తీపై రాష్ట్ర ప్రభుత్వం పక్కా ప్రణాళికతో వారికి నియామక ఉత్తర్వులు ఇచ్చేందుకు సన్నద్ధమైంది. మినిమం టైం స్కేల్ కింద ఉపాధ్యాయ నియామకాలు చేపట్టడం పట్ల 98 డీఎస్సీ అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి పని దినాలు పెంపునకు విన్నపాలు

- ఎన్ఎల్ఎం బృందం - కలెక్టర్‌తో భేటీ పలు అంశాలపై చర్చ

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పని దినాలు పెంచాలని ప్రజల నుండి విన్నపాలు వచ్చాయని నేషనల్ లెవెల్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ప్రదీప్ కుమార్ పిక్రై , సంతోష్ కుమార్ ప్రధాన్ బృందం పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ భవనంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరు పై జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు తో కలిసి సంబంధిత శాఖ అధికారులతో నేషనల్ లెవెల్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సమీక్షించారు. కర్నూలు జిల్లాలో కృష్ణగిరి, నందవరం మండలాల్లో 6 గ్రామ పంచాయతీలు, నంద్యాల జిల్లాలో కోయిలకుంట్ల, ఉయ్యాలవాడ మండలాల్లో 4 గ్రామ పంచాయతీలలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలును పరిశీలించాయని బందం సభ్యులు పేర్కొన్నారు. నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ పథకంలో భాగంగా స్వయం సహాయక సంఘాలు స్వయం ఉపాధికి సంబంధించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చాలా చక్కగా సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు. కర్నూలు, ఎమ్మిగనూరు ప్రాంతంలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ- గ్రామీణ్ కౌసల్య యోజన ట్రైనింగ్ సెంటర్ లో నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చే కార్యక్రమం పరిశీలించామన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ్ ఆవాస్ యోజన కింద వైఎస్ఆర్ ,జగనన్న కాలనీలలో నిర్మిస్తున్న గహాల పనులు చాలా బాగా జరుగుతున్నాయని, చూడటానికి ఒక కాలనీ లాగ అద్భుతంగా ఉందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పెన్షన్ల పంపిణీలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం వాలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి నెల ఒకటిన ఇంటింటికీ వెళ్ళి వాలంటీర్ల ద్వారా పెన్షన్ దారుల ఇంటికి వెళ్ళి వారికి పెన్షన్లు అందించే తీరు ఆకర్షణీయంగా ఉందన్నారు. అంతేకాకుండా సచివాలయ వ్యవస్థ ద్వారా అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి వారికి ఏ సమస్య వచ్చినా పరిశీలిస్తున్నార న్నారు. వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు పనులు బాగా నిర్వాహిస్తున్నారని వారు చేసిన పనుల గురించి విల్లేజ్ సర్వేయర్ ను ఆరా తీసినట్లు బృందం పేర్కొంది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకి చేరవేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నా మని, ఇంకా ఏమైనా క్షేత్రస్థాయిలో లోటుపాట్లు ఉంటే వాటిని సరిదిద్ది సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ నేషనల్ లెవెల్ మానిటరింగ్ కమిటీ సభ్యులకు తెలిపారు. జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్‌సి సుబ్రమణ్యం, హౌసింగ్ పిడి వెంకట నారాయణ, డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి, డిపిఒ నాగరాజు నాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు



కూలీలను ఉద్దేశించి మాట్లాడుతున్న నాగన్న

ఉపాధి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి నాగన్న

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఉపాధి కూలీలకు పెండింగులో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న డిమాండ్ చేశారు. బుధవారం లొద్దిపల్లె గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీల సమస్యలను బి.నాగన్న అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న మాట్లాడుతూ ఉపాధి పనులు చేసి 11 వారాలు అవుతున్నా కూలీ డబ్బులు రాలేదని, కూలీలు తమ ఆవేదనను తెలిపారని అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఈ మధ్యకాలంలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఉపాధి హామీ నిధులను రూ 30 వేల కోట్లు తగ్గించి కేటాయించారని, ఇది గ్రామీణ పేదల ఉసురు తీయడమేనని విమర్శించారు. ఉపాధి హామీ పనులకు వెళితే పనిచేసిన 15 రోజుల్లో కూలి డబ్బులు వస్తాయని ఆశించిన కార్మికులకు 11 వారాలైనా ఒక్క పైసా ఇవ్వలేదని, తక్షణమే ఉపాధి పెండింగు బిల్లులను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని లేనిపక్షంలో కూలీలతో సచివాలయాలను ముట్టడిస్తారని హెచ్చరించారు. ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ నరేష్, మాసుంబాష, ఉపాధి కూలీలు మెట్లు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు విదేశీ విద్య దూరం చేసిన జగన్

కల్లూరు తహశీల్దార్ ఆఫీస్ఎదుట టిడిపి ధర్నా



ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : వైసిపి ప్రభుత్వ విద్యా విధానం వలన పేదలకు విదేశీ విద్య దూరమవుతుందని టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి కాసాని మహేష్ గౌడ్ అన్నారు. 213 మందికి విదేశీ విద్య మంజూరు చేయడాన్ని నిరసిస్తూ టిడిపి కాసాని మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో కల్లూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం డిటి గిరికుమార్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మహేష్ గౌడ్ మాట్లాడుతూ విదేశీ విద్య పథకంలో ఎస్సీ, ఎస్టీ, బి.సి, మైనార్టీ, కాపు వర్గాలకు రాష్ట్ర, ప్రభుత్వం క్యూఎస్ 200 పేరుతో పథకం లబ్ధిదారులను కుదించడం తగదన్నారు. నిబంధనలను సరళతరం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌వి రామకృష్ణ, కేతురు మధు, అమర్నాథ్ గౌడ్, రామజనేయులు, రాజుయాదవ్, మదన, ధనంజయ, మాదేశ్, నాగరాజు, పౌల్‌రెడ్డి, పవన్, దొడ్డిపాడు బాషా, ఖాజబాషా, పాల్గొన్నారు.

11న నేషనల్ మెగా లోక్అదాలత్

కక్షిదారులకు సత్వర పరిష్కారం
కర్నూలు 3వ, 4వ పట్టణ పోలీసు స్టేషన్ ను ఎస్‌పి ఆకస్మిత కనిఖీ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఫిబ్రవరి 11న జాతీయ మెగా లోక్అదాలత్ నిర్వహించనున్నామని కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్‌పి సిద్ధార్థ కౌశల్ అన్నారు. అందులో భాగంగా కర్నూలు నగరంలోని కర్నూలు మూడవ, నాల్గవ పట్టణ పోలీసు స్టేషన్లను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. లోక్ అదాలత్‌లో భాగంగా పోలీసుస్టేషన్‌కు వచ్చిన కక్షిదారులు, ఇరుపక్షాల వారికి జిల్లా ఎస్‌పి కౌన్సిలింగ్ చేశారు. ఫిబ్రవరి 11న జరగబోయే జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమం గురించి జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్లలో సత్వర న్యాయ మేళా కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారన్నారు. పెండింగ్ కేసులలోని కక్షి దారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇరు పక్షాల వారికి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారన్నారు. నోటీసులు అందిన కక్షిదారులు వారి కేసులను లోక్అదాలత్‌లో రాజీద్వారా పరిష్కరించుకొనేందుకు ముందుకు రావాలన్నారు. కేసులు రాజీ ద్వారా పరిష్కరించుకుంటే సమయం తగ్గుతుందని, డబ్బు ఆదా అవుతుందని, కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. చిన్న చిన్న విషయాలకు ఘర్షణలతో పెండింగ్ కేసులు పేరుకు పోయాయని, రాజీ అయి కలిసిమెలిసి ఉండాలని తెలిపారు. కేసుల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించేలా చూడాలని, రాజీ అయ్యేవారికి కౌన్సిలింగ్ చేసి పెండింగులో ఉన్న కేసులను తగ్గించాలని పోలీసు అధికారులకు ఎస్‌పి తెలిపారు. జిల్లా ఎస్‌పి వెంట డిఎస్‌పి యుగంధర్ బాబు, కర్నూలు మూడు, నాల్గవ పట్టణ సిఐలు తబ్రేజ్, శంకరయ్య, ఎస్ఐలు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌పి సిద్ధార్థ కౌశల్

అభివృద్ధి పనులతో నగరం ప్రగతి పథం



మేయర్ బివై.రామయ్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

నగరంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులతో కర్నూలు ప్రగతి పథంలో నడుస్తుందని నగర పాలక సంస్థ మేయర్ బివై.రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ పరిధిలోని 4వ వార్డుల్లో రూ.1.16 కోట్ల నగర పాలక సాధారణ నిధులతో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే , మేయర్ శ్రీకారం చుట్టారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో ఆధునీకరించిన నాలుగు పార్కులను పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.9.70 లక్షలతో 31వ వార్డు సాయినగర్ పార్కు, రూ.6 లక్షలతో 29వ వార్డు వివేక్ నగర్ పార్కు, రూ.8 లక్షలతో కస్తూరినగర్‌పార్కు, రూ.9.60 లక్షలతో 37వ వార్డు ఆదిత్యనగర్ పార్కుల్లో ఆధునికరించిన పనులను ఎమ్మెల్యే, మేయర్ పునఃప్రారంభించారు. 36వ వార్డు డ్రైవర్స్ కాలనీలో రూ.33 లక్షలతో డబ్ల్యుబిఎం రోడ్డు నిర్మాణానికి, రూ.50 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో రాజీవ్ గృహకల్పలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకోల్పొందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ కల్లూరు అర్బన్ పరిధిలో రూ.55 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, అత్యవసర పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, కార్పొరేటర్లు సంగాల సుదర్శన్ రెడ్డి, గాజుల శ్వేతారెడ్డి, మిద్దె చిట్టెమ్మ, అయిషాసిద్దిఖీ, నారాయణ రెడ్డి, జయరాముడు, లక్ష్మీకాంత రెడ్డి, ఎంఇ.షాకిర్, డిఇఇ రాజశేఖర్, ఎఇ కృష్ణలత, హార్టికల్చర్ ఎడి సుజాత, నాయకులు శ్రీధర్ రెడ్డి, బాలచంద్ర రెడ్డి సాయి తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

రాష్ట్రస్థాయి రాతి దూలం పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - మద్దికెర

మండల కేంద్రంలో రథోత్సవం సందర్భంగా కొత్త పెట్రోల్ బంక్ ఎదురుగా బుధవారం ఉదయం 8 గంటల నుంచి రాష్ట్రస్థాయి సీనియర్ ఒంగోలు ఎద్దుల రాతి దూలం పోటీలను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రారంభించారు. ఎమ్మెల్యేకు నిర్వహకులు ఘనంగా స్వాగతించారు. ఆమె మాట్లాడుతూ పోటీలలో పాల్గొన్న వారందరూ విజేతలు కాలేరన్నారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. ఈ పోటీలను నిర్వహించేది నీవు నేను అన్న తేడాలు లేకుండా మనమందరం ఒకటే అనే ఉద్దేశంతో పోటీలను నిర్వహిస్తారని తెలిపారు. రాతి దూలంను లాగే ఎద్దులను విచ్చలవిడిగా కొట్టకుండా నేర్పరి తనముతో ఎద్దులను తోలాలన్నారు. మొదటి విజేతకు ధోనివియాదవ్ బ్రదర్స్ రూ.50,116, రెండవ బహుమతిని ఎంజి బ్రదర్స్ రూ.40 వేలు, మూడో బహుమతి రూ.30 వేలు కవి రెడ్డి రెడ్డప్ప యాదవ్ బ్రదర్స్, నాలుగో బహుమతి రూ.20 వేలు శ్రీకృష్ణ యాదవ్ యూత్, ఐదవ బహుమతి కబిరెడ్డి రామాంజనేయులు రూ.10 వేలు యాదవ్ బ్రదర్స్, ఆరవ బహుమతి రూ 10,116 వేలు హనుమాన్ యూత్, రూ. ఏడవ బహుమతి రూ 7,116 కవి రెడ్డి గోపాల్, 8వ బహుమతి రూ 5,116 వేలు కొలంట్ల రామాంజనేయులు యాదవ్, తొమ్మిదవ బహుమతి ఎం. రామాంజనేయులు రూ 5 వేలను వృషభాల విజేతలకు అందజేశారు.

ఆస్పత్రిని పరిశీలించిన ఎమ్మెల్యే శ్రీదేవి

ప్రజాశక్తి- వెల్దుర్తి



వెల్దుర్తిలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తిలో రూ.5 కోట్ల 77 లక్షలతో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవనాన్ని డాక్టర్ బాలచంద్రారెడ్డి, వైసిపి మండల కన్వీనర్ రవి రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి బుధవారం పరిశీలించారు. గతంలో మెరుగైన వైద్యం కోసం ఇక్కడి ప్రాంత ప్రజలు కర్నూలు తరలి వెళ్లే వారిన్నారు. రోగులు పడుతున్న బాధలను గమనించిన జగనన్న సీఎం అయిన వెంటనే 30 పడకల ఆసుపత్రి నిర్మిస్తామని మాట ఇచ్చారన్నారు. అందులో భాగంగానే త్వరలోనే ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ఆస్పత్రి ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తెలియజేశారు. అంతకుముందు 16 వ వార్డులో గడప గడప కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్లు, వైఎస్ఆర్ పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశులు

ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

అందరికీ చదువు అందిస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్నాయని, విద్యార్థులకు చదువు చెప్పాల్సిన ఉపాధ్యాయుల పోస్టులను మాత్రం భర్తీ చేయడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.వెంకటేశులు విమర్శించారు. బుధవారం మండలంలోని పాండవగల్లు పాఠశాల విద్యార్థులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యారంగానికి కేటాయింపులు చేస్తున్నామని, కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్య అందిస్తామని ప్రభుత్వాలు మాటలకే పరిమితమయ్యాయని మండిపడ్డారు. పాండవగల్ గ్రామంలో 200 మంది విద్యార్థులు ఉంటే, కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని తెలిపారు. ఇద్దరితో పిల్లలకు చదువు ఎలా సాధ్యపడుతుందని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నత స్థాయి అధికారులు మరో ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పాఠశాలకు తాళాలు వేసి నిరసన తెలుపుతామని హెచ్చరించారు. సిపిఎం శాఖ కార్యదర్శులు పాండురంగ, గోవిందు, గ్రామస్తులు అన్వర్ బాషా పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర ఖోఖో పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - కోసిగి రూరల్

రేణుక ఎల్లమ్మ జాతర సందర్భంగా కోసిగి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో అంతర్‌రాష్ట్ర ఖోఖో పోటీలు ప్రారంభమయ్యాయి. ఎంపిపి ఈరన్న, సింగిల్ విండో ప్రెసిడెంట్ మహంతేష్ స్వామి, వైసిపి సీనియర్ నాయకులు మాణిక్యరాజు, మాజీ జడ్‌పిటిసి మంగమ్మ, నాడిగేని నాగరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.కృష్ణమూర్తి, పీడీ ఖలీల్ అహ్మద్ బుధవారం పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. క్రీడల్లో రాష్ట్రంలో కోసిగికి మంచి పేరు ఉందని తెలిపారు. మండలం నుంచి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో జాతీయస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, మంచి పేరు తెచ్చిన ఘనత ఉందన్నారు. క్రీడాకారులు స్నేహభావాన్ని పెంపొందించుకొని క్రీడల్లో పాల్గొనాలని తెలిపారు. పీడీ ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ... అంతర్ రాష్ట్ర ఖోఖో పోటీల్లో 14 జట్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. హోళగుంద కోసిగయ్య, నారాయణ డిగ్రీ కళాశాల పీడీ బాలు, క్రీడాకారులు కేశవ్, బసవ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనమందించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విజయ్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానికంగా ఉన్న వీవర్స్ కాలనీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగనన్న గోరుముద్ద ద్వారా నాణ్యమైన భోజనం అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతుందే తప్ప అది కింది స్థాయిలో అమలు కావడం లేదని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ పట్టణ సహాయ కార్యదర్శి వెంకన్న పాల్గొన్నారు.

ఎమ్‌డిఆర్‌టి సాధించిన

ఏజెంట్లకు లియాఫీ ఘన సన్మానం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు : ఎమ్మిగనూరు ఎల్ఐసి బ్రాంచిలో ఎమ్‌డిఆర్‌టి సాధించిన ఏజెంట్లు హకీమ్ సుభాన్, కె.వెంకటేశ్వర రెడ్డి, జి.రామాంజినేయులు, షబ్బీర్ సాహెబ్, సి.లక్ష్మన్న, టి.ఈరన్న గౌడ్, ఈ.హరిమోహన్‌ను లియాఫీ తరపున సన్మానించారు. బుధవారం జరిగిన ఈసీ మీటింగ్‌లో లియాఫీ డివిజన్ ప్రెసిడెంట్ జయభారతరెడ్డి, ఆల్ ఇండియా ఈసీ మెంబర్ కె.రమేష్, ప్రెసిడెంట్ కె.వెంకటేశ్వర రెడ్డి, సెక్రటరీ ప్రభాకరరెడ్డి, ట్రెజరర్ జెకె.శివరాముడు ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎల్ఐసి ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి లియాఫీ కృషి చేస్తోందని తెలిపారు. బ్రాంచిలో అత్యధిక వ్యాపారం చేసిన వారిని ప్రతి ఏజెంట్ స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. డివిజన్ నాయకులు ఆంధ్రయ్య, హరినాథ్, అనంత రామన్న బురలి, జయరాముడు, క్లియా వేణుగోపాల్, లియాఫీ మాజీ నాయకులు రంగస్వామి, సోమన్న పాల్గొన్నారు.



ఏజెంట్లను సన్మానిస్తున్న లియాఫీ ఎమ్మిగనూరు బ్రాంచి నాయకత్వం

'అప్పర్ భద్ర'తో ముప్పు

- దిగువ ప్రాంతం ఎడారిగా మారే ప్రమాదం
- నోరు తెరవని పాలకులు

ప్రజాశక్తి - ఆదోని

తుంగభద్ర ఎగువన 'అప్పర్ భద్ర' ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయితే దిగువ ప్రాంతమైన రాయలసీమ ఎడారిగా మారే ప్రమాదం ఉంది. రాజకీయ లబ్ధి కోసమే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కర్ణాటకలో 'అప్పర్ భద్ర'కు రూ.5300 కోట్లు కేటాయించినట్లు రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు...

ఈ ఏడాది కర్ణాటక రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అక్కడ రాజకీయంగా లబ్ధి పొందాలనే దురుద్దేశంతోనే కేంద్ర బడ్జెట్‌లో ఏకంగా రూ.5,300 కోట్లు అప్పర్ భద్రకు కేటాయించారు. ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ హోదా కలిగిన పోలవరం ప్రాజెక్టుకు మొండి చేయి చూపారు. ఇప్పటికే 130 టిఎంసిల సామర్థ్యం గల తుంగభద్ర ప్రాజెక్టు పూడిక కారణంగా 100 టిఎంసిలకు చేరింది. రెండు పంటలకు సాగునీరందని దుస్థితి ఉంది. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి హెచ్ఎల్‌సి, ఎల్ఎల్‌సి ద్వారా కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలకు తాగు, సాగునీరు అందుతోంది. వర్షాలు సమృద్ధిగా లేకపోతే తుంగభద్ర ప్రాజెక్టుకు నీరు వచ్చే పరిస్థితి తక్కువ. ప్రాజెక్టు ఒట్టి పోయి రాయలసీమ ఎడారిగా మారే ప్రమాదం ఉంది.



తుంగభద్ర దిగువ కాలువ

ఇప్పటికీ పరిస్థితి అంతంతే : తుంగభద్ర దిగువ కాలువ కింద కర్నూలు జిల్లాలో ఆలూరు, ఆదోని, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల్లో సుమారు 1.51 లక్షల ఎకరాలకు సాగునీరందాల్సి ఉంది. ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపాలిటీలకు తాగునీరు అందిస్తోంది. 195 గ్రామాలు తాగునీటి కోసం తుంగభద్ర డ్యాంపైనే ఆధారపడుతున్నాయి. కర్ణాటకలో జరుగుతున్న జలచౌర్యం కారణంగా తుంగభద్ర దిగువ కాలువలో నీటి ప్రవాహం అంతంత మాత్రమే. ఆంధ్ర సరిహద్దు అయిన హానవాలు వద్ద 650 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండాల్సి ఉండగా 400 క్యూసెక్కులలోపే ఉంటుంది. కోసిగి, కౌతాళం, పెద్దకడబూరు ప్రాంతాలకు సాగునీరందని పరిస్థితి. కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లాలో తుంగభద్రపై భద్ర ప్రాజెక్ట్ నిర్మాణానికి అక్కడి ప్రభుత్వం పూనుకుంది. నిర్మాణం పూర్తయితే తుంగభద్రకు నీరందక ఒట్టిపోయే ప్రమాదం ఉందని రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు. బహుళార్థక ప్రాజెక్ట్ తుంగభద్ర డ్యాంపై కర్ణాటక అధికారులే పెత్తనం చలాయిస్తున్నారని ఎల్ఎల్‌సి అధికారులు పేర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని నీటి వాటా కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలి.

నోరు తెరవని ఎంపీ, ఎమ్మెల్యేలు

- మీనాక్షి నాయుడు, మాజీ ఎమ్మెల్యే, ఆదోని



'అప్పర్ భద్ర' నిర్మాణం జరిగితే కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలకు సాగు, తాగునీటికి ఇబ్బంది ఏర్పడుతుంది. ఈ నిర్మాణం పట్ల రైతు సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు ఆందోళనలు చేస్తున్నా అధికార పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలు నోరు మెదపకపోవడం బాధాకరం. రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి 'అప్పర్ భద్ర' నిర్మాణాన్ని అడ్డుకునే దిశగా చర్యలు చేపట్టాలి. అవసరమైతే అఖిలపక్షం ఏర్పాటు చేసి కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలి. స్థానికంగా రైతు సంఘాలను కూడగట్టుకొని టిడిపి ఆధ్వర్యంలో ఆందోళన చేపడతాం.

నిర్మాణాన్ని ఆపాలి

- వెంకటేశులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు



రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించకుండా తుంగభద్రపై 'అప్పర్ భద్ర' నిర్మాణం చేపట్టడం తగదు. జాతీయ ప్రాజెక్టుగా కేంద్ర ప్రభుత్వం గుర్తించి ఆగమేఘాలపై రూ.5,300 కోట్లు కేటాయించడం భావ్యం కాదు. అక్కడ ప్రాజెక్టు నిర్మిస్తే దిగువన ఉన్న ప్రాంతాలకు నష్టం జరుగుతుందన్న ఆలోచన కూడా కేంద్ర ప్రభుత్వానికి రాకపోవడం బాధాకరం. కేంద్ర ప్రభుత్వం అక్రమ ప్రాజెక్టులకు వత్తాసు పలకడం బాధాకరం. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతమైన ఆదోని అన్ని రంగాల్లో వెనుకబడి ఉంది. అప్పర్ భద్ర నిర్మాణం జరిగితే ఎల్ఎల్‌సికి నీటి ప్రవాహం ప్రశ్నార్థకమే. ఆర్‌డిఎస్‌కు కూడా తుంగభద్ర నీరు వచ్చే పరిస్థితి ఉండదు. ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి.

రాజకీయాలకు అతీతంగా పోరాటం

- పి.తిక్కారెడ్డి, టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ.



స్వాతంత్ర్యానికి ముందే సాగు, తాగు నీటి కోసం తుంగభద్రను డిజైన్ చేశారు. కర్ణాటకలో చాలా రోజుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా పెద్ద పెద్ద లిఫ్టులు కట్టినా ప్రభుత్వాలు పట్టించుకోలేదు. గతంలో ఆల్మట్టి కట్టినప్పుడు కూడా ఏం చేయలేకపోయాం. అప్పర్ భద్రపై పోరాడకపోతే రాయలసీమ ఎడారిగా మారుతుంది. భవిష్యత్ తరాలకు తాగడానికి కూడా నీళ్లు లేకుండా పోతాయి. ప్రజలను, రైతులను చైతన్యం చేసి తిరగబడేలా చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం నిపుణులైన విశ్రాంత ఇంజనీర్లతో నిజ నిర్ధారణ కమిటీ వేయాలి. టిడిపి తరపున కార్యక్రమాలు చేస్తాం. వైసిపి ప్రజాప్రతినిధులు పోరాడితే మరింత ఫలితం ఉంటుంది. వైసిపి నాయకులు ముందుకొస్తే అవసరమైతే కలిసి పోరాటం చేస్తాం. రాజకీయాలకు అతీతంగా పోరాడతాం.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - దేవనకొండ



అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని పి.కోటకొండ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల మేరకు... గ్రామానికి చెందిన ముచ్చు వెంకటేష్ (42) తనకున్న 1.50 ఎకరాల సొంత పొలంతో పాటు మరో 2.50 ఎకరాలను కౌలుకు తీసుకొని కుటుంబాన్ని పోషిస్తున్నారు. గత రెండేళ్లుగా పంటల పెట్టుబడుల కోసం రూ.8 లక్షలు అప్పులు చేశారు. దిగుబడి లేక, చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కోడుమూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్దదిక్కు మృతి చెందడంతో కుటుంబ సభ్యుల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రబీ పంటలకు ఈకేవైసీ తప్పనిసరి : ఎఒ

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలో రబీలో సాగు చేసిన పంటలకు రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఎఒ సురేష్ బాబు తెలిపారు. బుధవారం మండలంలోని మాచాపురం రైతు భరోసా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో 600 మంది రైతులు ఈకేవైసీ చేయాల్సి ఉందన్నారు. రైతులు తమకు సంబంధించిన వాలంటీర్లతో, రైతు భరోసా కేంద్ర సిబ్బందితో కలిసి వేలిముద్రలు వేయాలని తెలిపారు. ఈకేవైసీ చేయకపోతే ప్రభుత్వ మద్దతు ధర లభించిందని తెలిపారు. అలాగే పిఎం కిసాన్‌కు సంబంధించి ఇంకా చాలామంది వేలి ముద్రలు వేయాల్సి ఉందని చెప్పారు. త్వరలోనే వారి ఖాతాలో నగదు జమ చేస్తారని, రైతులు వెంటనే వేయాలని సూచించారు.

'అప్పర్ భద్రత'తో రాయలసీమకు నష్టం

- రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రయ్య

ప్రజాశక్తి - ఆదోని

కర్ణాటక రాష్ట్రంలో నిర్మిస్తున్న 'అప్పర్ భద్ర' ప్రాజెక్టు నిర్మాణంతో రాయలసీమ ఎడారిగా మారే ప్రమాదం ఉందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి కె.జగన్నాథం ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని రెడ్డి కల్యాణ మండపంలో రైతుసంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మీ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రంలో ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కేంద్ర ప్రభుత్వం 'అప్పర్ భద్ర' ప్రాజెక్టుకు రూ.5,300 కోట్లు కేంద్ర బడ్జెట్‌లో కేటాయించిందని తెలిపారు. నిర్మాణ పనులను రద్దు చేయకపోతే రాయలసీమలోని రాజకీయ పార్టీలు ఏకమై ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ మాట్లాడారు. తుంగభద్ర నీటితో రెండు పంటలకు అవకాశం ఉన్నా నీటిని వినియోగించుకోలేని పరిస్థితిలో ఉన్నామని తెలిపారు. కర్ణాటక ప్రాంతంలో జలచౌర్యం జరుగుతున్నా నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారని విమర్శించారు. సాగు, తాగునీటికి తుంగభద్రపై ఆధార పడ్డామని తెలిపారు. నిర్లక్ష్యం చేస్తే ఈ ప్రాంతం ఎడారిగా మారే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. 'అప్పర్ భద్ర' ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకునేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతు ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. రైతు సంఘం నాయకులు ఆదినారాయణ రెడ్డి, ఎపిసి శ్రీకాంత్ రెడ్డి, పెద్ద అయ్యన్న, మల్లికార్జున, దేవిశెట్టి ప్రకాష్, వెంకటేశ్వర్లు, మల్లికార్జున, ప్రసాద్, అజయ్ బాబు, సుదర్శన్, వీరేష్, గోపాల్, విజయ్, ప్రకాష్, శ్రీనివాసులు, సాబీర్ బాష, పుష్ప రాజు హాజరై మాట్లాడారు. వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రయ్య

పట్టణాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- వైసిపి సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణాభివృద్ధే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని వైసిపి సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని 30, 31వ వార్డుల్లో సోమప్ప నగర్‌లో సిసి రోడ్లు, డ్రెయినేజీలు పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పురపాలక సంఘానికి 14వ ఆర్థిక సంఘం కింద మంజూరైన నిధులు రూ.11 కోట్లలో రూ.9 కోట్లతో సిసి రోడ్లు, డ్రెయినేజీలు, ప్రహరీ తదితర నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో సిసి రోడ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిడిపి నుంచి పైపులైన్ల ద్వారా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందని తెలిపారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ డి.నజీర్ అహ్మద్, కమిషనర్ ఎన్.గంగిరెడ్డి, టిపిఒ గోపాల్ కృష్ణ, టౌన్ బ్యాంకు ఛైర్మన్ యుకె.రాజశేఖర్, కోఆపరేటివ్ స్టోర్ ఛైర్మన్, పట్టణ జెసిఎస్ కన్వీనర్ షబ్బీర్ అహ్మద్, పట్టణ అధికార ప్రతినిధి కె.సునీల్ కుమార్, కౌన్సిలర్ బజారి, ఇస్సాక్, ఇన్‌ఛార్జీలు విశ్వనాథ్, పురుషోత్తం, విశ్వనాథ్, రమేష్, మన్సూర్ బాషా, మోకానిక్ బాషా పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - హోళగుంద

ఆధార్ కేంద్రాలను ఎంపిడిఒ దాసు నాయక్ బుధవారం పరిశీలించారు. 7 నుంచి 10 వరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేకంగా ఆధార్ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని, తహశీల్దార్ కార్యాలయం రైతుభరోసా కేంద్రంలో గల కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రెండురోజులుగా 122 మంది సేవలు అందుకున్నట్లు తెలిపారు. బర్త్ సర్టిఫికేట్, ఏజ్ కరెక్షన్, పేర్లు తప్పులు తదితర ఆధార్ అప్‌డేటేషన్ చేసుకోవచ్చన్నారు.

మద్దతు ధర కరువు...

- దగా పడుతున్న శనగ రైతులు...
- ప్రయివేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకుంటున్న వైనం
- బాజు పేరిట దోపిడీ

ప్రజాశక్తి-ఆలూరు

ఆరుగాలం కష్టపడి పండించిన పప్పు శనగ రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వం నుంచి రైతులకు చేదోడు లేకపోవడంతో ప్రయివేట్ వ్యాపారుల చేతుల్లో దగా పడుతున్నారు. కనీస మద్దతు ధర లభించకపోవడంతో బాజు పేరిట నిలువు దోపిడీకి గురవుతున్నారు.

ఆలూరు సబ్ డివిజన్‌లోని ఐదు మండలాల్లో రబీ సీజన్‌లో 35,317 హెక్టార్లలో పప్పు శనగను సాగు చేశారు. ఇప్పటివరకు 20 వేల హెక్టార్లలో పప్పు శనగ ఈ-క్రాప్ నమోదయింది. రైతు ఒక ఎకరాకు రూ.12 వేల నుంచి రూ.15 వేల దాకా పెట్టుబడి పెట్టి సాగు చేశారు. రైతులకు ఎకరాకు 3 నుంచి 6 క్వింటాళ్లలోపు దిగబడి వచ్చింది.

మద్దతు ధర కరువు

ప్రభుత్వం పప్పు శనగ క్వింటాకు రూ.5,230 మద్దతు ధర కల్పించి చేతులు దులుపుకుంది. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల జాడ కనిపించడం లేదు. ప్రస్తుతం పంట దిగుబడులు జోరందుకున్నాయి. ఆలూరు సబ్ డివిజన్‌లో ఏ గ్రామంలో చూసినా పప్పు శనగ కోతలు జోరుగా సాగుతున్నాయి. పంట దిగుబడులు చేతికొచ్చిన తరుణంలో మంచి ధరకు అమ్ముకుందామంటే కొనుగోలు కేంద్రాలు లేక రైతులు నిరాశ పడుతున్నారు. దిగుబడులను ఇంట్లో నిల్వ ఉంచుకునే అవకాశం లేకపోవడం, పంట సాగుకు చేసిన అప్పులు తీర్చుకునేందుకు గత్యంతరం లేక ప్రయివేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో ధర మేరకు క్వింటా రూ.4,500 ప్రయివేట్ వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. మద్దతు ధర, కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు క్వింటాకు రూ.600 నష్టపోవాల్సి వస్తోంది. ఆలూరు సబ్ డివిజన్ వ్యాప్తంగా పప్పు శనగ రైతులకు మద్దతు ధర లేక రూ.కోట్లలో నష్టపోతున్నారు.



శనగ పంటను మిషన్‌లో వేస్తున్న కూలీలు

బాజు పేరుతో దోపిడీ

ఒక వైపు తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ మరో వైపు బాజు పేరుతో వ్యాపారులు రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఒక క్వింటాకు బాజు పేరిట 3 కిలోల నుంచి 4 కిలోల వరకు కోత వేస్తూ రైతులను ముంచుతున్నారు. 50 క్వింటాళ్ల దిగుబడి వచ్చిన రైతు ఈ ప్రకారం లెక్కేస్తే బాజు పేరుతో రెండు క్వింటాళ్ల వరకు నష్టపోతున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- వడ్డే రామయ్య, రైతు, ఆస్పరి



ప్రభుత్వం పప్పు శనగకు రూ.5,230 మద్దతు ధర ప్రకటించి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. చేతికొచ్చిన పంటను ఇంట్లో ఉంచుకొనే అవకాశం లేక తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే మద్దతు ధరకు అమ్ముకునే అవకాశం ఉంటుంది.

క్వింటాకు 4 కిలోలు దోచేస్తున్నారు

- రంగముని, రైతు, హాలహర్వి



ప్రభుత్వం మద్దతు ధరకు పప్పు శనగ కొనుగోలు చేయకపోవడంతో ప్రయివేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నాం. మద్దతు ధర కన్నా ప్రయివేట్ వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేయడమే కాకుండా క్వింటాకు బాజు పేరుతో 4 కిలోలు దోచేస్తున్నారు.

అనుమతులు వస్తే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

- ఎడిఎ సునీత



ప్రభుత్వం ఎపి మార్క్‌ఫెడ్ ద్వారా పప్పు శనగను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. గ్రామంలో పప్పు శనగ దిగుబడులు వస్తున్నాయి. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వెంటనే గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. పంటను అమ్ముకోవాలని అనుకున్న రైతులు రైతు భరోసా కేంద్రాల్లో ఈ-క్రాప్ చేయించి రిజిస్టర్ చేయించుకోవాలి.

అప్పుల బాధతో వివాహిత ఆత్మహత్య


ప్రజాశక్తి - దేవనకొండ



వ్యవసాయ పెట్టుబడుల కోసం భర్త చేసిన అప్పులు ఎలా తీర్చాలనే మనస్థాపంతో వివాహిత శ్రీదేవి (38) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మండలంలోని కూకటికొండ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన రైతు ఉప్పర తిమ్మప్ప తనకున్న 8 ఎకరాల్లో పంటలు సాగు చేసి కుటుంబాన్ని పోషించేవారు. పంటలు సరిగా పండక రూ.8 లక్షలు అప్పులు చేశారు. మృతురాలు శ్రీదేవి అప్పులు తీర్చేందుకు వలస వెళ్దామని చెప్పినా భర్త వినలేదు. తీవ్ర మనస్థాపానికి గురై అప్పులు ఎలా తీర్చాలో తెలియక పురుగు మందు తాగారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పత్తికొండ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. కర్నూలుకు వస్తుండగా శ్రీదేవి మార్గమధ్యంలో మృతి చెందారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - చిప్పగిరి



మండలంలోని కుందనగుర్తి గ్రామంలో సర్పంచి కొండా పురుషోత్తం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు నరేంద్ర, రామాంజనేయులు పంచాయతీ కార్మికుల చేత బుధవారం పారిశుధ్య పనులను చేయించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడారు. గ్రామంలో దోమలు వ్యాప్తి చెందకుండా, అంటువ్యాధులు దరి చేరకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులను చేయిస్తున్నామని తెలిపారు. బ్లీచింగ్ పౌడర్‌ను చల్లిస్తున్నామని చెప్పారు. వేసవి ప్రారంభమైనందున గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా సత్వర చర్యలు చేపట్టామన్నారు. గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని తెలిపారు.

కమ్యూనిటీ హాలు నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-ఆలూరు

మండలంలోని మొలగవల్లి గ్రామ పంచాయతీలో గిడ్డి ఆంజనేయ స్వామి ఆలయం దగ్గర కమ్యూనిటీ హాలు నిర్మాణానికి భూమిపూజ చేశారు. బుధవారం శ్రీచెన్నకేశవ ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ భూపేష్ ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్ మాట్లాడారు. గ్రామంలోని సర్వే నెంబరు 762/సిలో ఉన్న 10 సెంట్ల స్థలంలో కనకమేడల రవీంద్రకుమార్ ఎంపీ నిధులతో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సహకారంతో రూ.40 లక్షల నిధులతో కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. పిఆర్ డిఇ శ్రీరాములు, ఎఇ చౌడరెడ్డి, సర్పంచి మోహన్ రాజు, కాంట్రాక్టర్ రఘునాథ్ రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షులు శివరామిరెడ్డి, లీగల్ అడ్వయిజర్ ప్రవీణ్ కుమార్, సిపిఐ మండల కార్యదర్శి రామాంజనేయులు, శివ స్వాముల గురుస్వామి, ప్రసాద్, శ్రీరామ్, జయరాం, నౌనేపాటి, తిమ్మన్న పాల్గొన్నారు.

'ఎమ్‌డిటి మందులు ద్వారా కుష్టు నివారణ'

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రభుత్వం ఉచితంగా అందించే ఎమ్‌డిటి మందుల ద్వారా కుష్టు వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని డిప్యూటీ ప్యారా మెడికల్ ఆఫీసర్ చంద్రయ్య శెట్టి తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కుష్టు వ్యాధి లక్షణాలు, నివారణపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు హంపయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు జరిగే మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా 10 పిహెచ్‌సి కేంద్రాల పరిధిలో ప్రజలను చైతన్యం చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పోలియో, మసూచి వ్యాధులను తరిమికొట్టామని, ప్రస్తుతం కుష్టు వ్యాధిని కూడా సమిష్టి కృషితో నివారిద్దామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎవరికైనా శరీరంపై ఎక్కడైనా స్పర్శ లేని మచ్చలు ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కుష్టు వ్యాధిగా నిర్ధారణ అయితే భయాందోళనకు గురి కాకుండా ఎమ్‌డిటి మందులు వాడితే పూర్తిగా నయం అవుతుందని సూచించారు. విద్యార్థులు పొరుగు వారిని గమనించి తగిన సూచనలు చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 'రావూస్' విద్యార్థిని

ఎమ్మిగనూరు : పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాల విద్యార్థిని కీర్తి రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. బుధవారం కళాశాలలో ప్రిన్సిపల్ ప్రకాష్, అధ్యాపకులు పుల్లయ్య, ధనుంజయ, గోవిందు కీర్తికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. రావూస్ డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరం బిబిఎ విద్యార్థిని కీర్తి కర్నూలులో జరిగిన అంతర్ రాష్ట్ర హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. కేరళలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీలో ఈనెల 15 నుంచి 19 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రావూస్ విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడల్లోను రాణించడంపై సంతోషం వ్యక్తం చేశారు.

ఘనంగా విశ్వలింగేశ్వర స్వామి రథోత్సవం

కోసిగి రూరల్ : మండలంలోని అగసనూరు గ్రామంలో శ్రీవిశ్వలింగేశ్వర స్వామి రథోత్సవం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో వైభవంగా సాగిందని ఆలయ ప్రధాన పూజారి ఈరన్న తెలిపారు. బుధశారం తెల్లవారుజామున 5 గంటల నుంచి స్వామివారికి పాలాభిషేకాలు నిర్వహించారు. అనంతరం పార్వతి అమ్మ వారికి వస్త్రాలంకరణ చేశారు. స్వామివారి పూజా కార్యక్రమం అనంతరం హోమాలతో పూజలు నిర్వహించారు. అగసనూరు గ్రామం చుట్టుపక్కల ఉన్న సాతనూరు, కందుకూరు, మూగలదొడ్డి, కర్ణాటక రాష్ట్రంలో ఉన్న జూకూరు, రాజలబండ, తదితర గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చారు. గ్రామంలోని ఆడపడుచులు కలశాలతో స్వామివారి పూర్ణకుంభాన్ని మేళతాళాలతో రథోత్సవం దగ్గరికి తీసుకెళ్లారు. అనంతరం స్వామివారి రథోత్సవాన్ని ఊరేగించారు. భక్తులకు గ్రామ పెద్దలు, గుడి ప్రధాన పూజారి ఈరన్న ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.





వ్యవసాయ పరిశోధన క్షేత్రాలను పరిశీలిస్తున్న రాష్ట్ర వ్యవసాయ సలహాదారు తిరుపాల్ రెడ్డి, అధికారులు

జీతం ఇంకా రాలేదు..!

- ఉద్యోగుల జీతాలు, పెన్షన్ల చెల్లింపులో ఆలస్యం
- ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఉద్యోగులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు, పెన్షనర్లకు పెన్షన్ల చెల్లింపులు నెల నెలకూ ఆలస్యం అవుతూనే ఉన్నాయి. జనవరి నెల వేతనం ఇప్పటి వరకూ జమ కాలేదు. ప్రభుత్వం సకాలంలో వేతనాలు, పెన్షన్లను చెల్లించలేకపోవడంపై ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది...

జిల్లాలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ జీతాల కోసం, పెన్షనర్లు పెన్షన్ల కోసం ప్రతి నెలా ఎదురు చూడాల్సి వస్తోంది. సకాలంలో అవి అందక, ఇఎంఐలు చెల్లించలేక, ఇతర అవసరాలు తీర్చుకోలేక అల్లాడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 45 వేల మంది ఉద్యోగులు, 15 వేల మంది ఉపాధ్యాయులు, 5 వేల మంది పెన్షనర్లు ఉన్నారు. గత నెల 10వ తేదీ తరువాత వేతనాలు, పెన్షన్లను ఖాతాల్లో జమ చేశారు. చాలా మందికి ఇప్పటి వరకూ జనవరి నెల



వేతనం తమ ఖాతాల్లో జమ కాలేదు. రెవెన్యూ, వైద్య శాఖలో కొందరికి, గ్రామ సచివాలయ ఉద్యోగులకు మాత్రం వేతనం జమ అయింది. అందరికీ చెల్లింపులు పూర్తయ్యేసరికి ఈ నెల 15వ తేదీ దాటుతుందనేది అంచనా. సాధారణంగా వేస్ అండ్ మీన్స్, ప్రత్యేక డ్రాయింగ్ సదుపాయం, ఓవర్ డ్రాఫ్ట్ సౌలభ్యం పేరిట రాష్ట్రం అప్పుల వెసులుబాటు వినియోగించుకుంటూ ఉంటుంది. ఓవర్ డ్రాఫ్ట్ పేరుతో వినియోగించుకోదగ్గ మొత్తమూ అంతంతే. పైగా నిర్దిష్ట గడువులోగా వాటిని తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. అందులోనూ ఇబ్బందులు ఉన్నాయి. రాష్ట్రంలో ఇంకా రూ.2,900 కోట్లు పింఛన్లు, జీతాలు కలిపి చెల్లించాలి. రాష్ట్ర ప్రభుత్వం బహిరంగ మార్కెట్లో రుణం తీసుకోవాలంటే దానికీ పరిమితులు ఉన్నాయి. ఇప్పటికే ఎపి తన పరిమితిని దాటేసింది. అంటే ఈ నెల అప్పు కూడా పుట్టదు. మరో వైపు కార్పొరేషన్ల నుంచి రుణం తీసుకునే అవకాశమూ లేదు. ఈ నెల ప్రారంభంలో రూ.2,000 కోట్లను ఏదో కార్పొరేషన్ పేరిట బ్యాంకుల నుంచి అప్పు తీసుకుని, రాష్ట్ర అవస రాల కోసం సర్దుబాటు చేసేశారు. ఇప్పటికే మద్యం సొమ్ముల పేరుతో రూ.8,300 కోట్లు, ఇతరత్రా కార్పొరేషన్ల పేరుతో మరో రూ.12,000 కోట్ల రుణాలు ప్రభుత్వం వినియోగించుకున్నట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో ఇతరత్రా అవసరాలు పోను రోజువారీ రాబడిలో ఎంత మొత్తం జీతాలకు, పింఛన్లకు చెల్లిస్తారనే అంశంపైనే నవంబరు జీతాలన్నీ ఎప్పటికి చెల్లించగలరో తేలనుంది. గత నెల 10వ తేదీ పైన వేతనాలు పడటం, ఈ నెల కూడా ఆలస్యం అవుతుండటంతో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

నాణ్యమైన విత్తనాలు అందించాలి

- రాష్ట్ర వ్యవసాయ సలహాదారు తిరుపాల్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వ్యవసాయ పరిశోధన క్షేత్రాల ద్వారా మంచి పరిశోధనాలు చేసి నాణ్యమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు తిరుపాల్ రెడ్డి సంబంధిత వ్యవసాయ శాస్త్రవేత్తలకు సూచించారు. బుధవారం నంద్యాల జిల్లాలోని ప్రాంతీయ పరిశోదనా స్థానం, నేషనల్ సీడ్ కార్పోరేషన్, రైతులకు సరపరా చేసే విత్తనాల గోదాములను, జొన్న, పొద్దుతిరుగుడు, శనగ పంటల క్షేత్రాలను రాష్ట్ర వ్యవసాయ సలహాదారు తిరుపాల్ రెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి టి మోహన్ రావుతో కలిసి సందర్శించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సంచాలకులు డాక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు పరిశోధనలు, పత్తి, జొన్న, శనగ, పొద్దు తిరుగుడు, చిరుధాన్యాలు, పొగాకు, వరి పంటల గురించి వివరించారు. ఈ సందర్భంగా తిరుపాల్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ, డ్రోన్ల వాడకంపై అవగాహన కల్పించాలన్నారు. రైతులకు కావలసినన్ని నాణ్యమైన విత్తనాలను సరపరా చేసేలా నేషనల్ సీడ్ కార్పోరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఎడిఎ రాజశేఖర్, మండల వ్యవసాయ అధికారి స్వప్నిక, వ్యవసాయ అధికారి (టెక్నీకల్) అయూబ్ బాష, జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలులో న్యాయ విశ్వవిద్యాలయం

- నంద్యాల, కర్నూలు జిల్లాల్లో పవర్ ప్రాజెక్ట్
- రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలులో జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోద ముద్ర వేసింది. అమరావతి సచివాలయంలో బుధవారం సమావేశమైన ఎపి మంత్రి మండలి పలు నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. నంద్యాల, కర్నూలు జిల్లాల్లో సోలార్, విండ్ ప్రాజెక్టులకు అనుమతినిస్తూ తీర్మానించింది. ఎకోరెన్ సంస్థ ఒక్కో ప్రాజెక్టును దశల వారీగా వెయ్యి మెగా వాట్ల సామర్థ్యంతో వీటిని ఏర్పాటు చేయనుంది. 2027 నాటికి ఈ ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి కానుంది. నంద్యాల జిల్లా డోన్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బోధనా సిబ్బంది నియామకానికి మంత్రి మండలి ఆమోదం తెలిపింది. కొత్తగా ఏర్పడిన నంద్యాల జిల్లా కేంద్రాన్ని రెండు మండలాలుగా విభజిస్తూ నూతనంగా రూరల్ మండలాన్ని ఏర్పాటు చేసేందుకు ఆమోదముద్ర వేసింది. 1998 డిఎస్సీకి ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగ్ ఇచ్చేందుకు మంత్రిమండలి అంగీకారం తెలిపింది. వీటితో పాటు పలు సంక్షేమ పథకాలకు ఆమోదం తెలిపింది.

అగ్ని ప్రమాదంలో 13 గేదెలు సజీవ దహనం

ప్రజాశక్తి - శిరివెళ్ళ

మండలంలోని ఖాదరబాదర గ్రామంలో మంగళవారం గుడిసెలో అర్ధరాత్రి ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో 13 గేదెలు సజీవ దహనం అయినట్లు బాధితులు బోరున విలపించారు. బాలకృష్ణ, బాలమ్మ, రాముడు తదితరులకు చెందిన 13 గేదెలు మంటల్లో చిక్కుకుని మృతి చెందాయి. స్థానిక ఎమ్మెల్యే గంగుల బిజేంద్ర రెడ్డి, ఎంపిపి నాయక్ మహమ్మద్ వసీం, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ నాయక్ దిల్షాధ్ ముజఫర్ హుస్సేన్, సర్పంచ్ లక్కాకుల చంద్ర, పశు వైద్య అధికారి దస్తగిరి, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు సంఘటన స్థలానికి చేరుకొని బాధితులను పరామర్శించారు. వారి వెంట మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ విజయ శేఖర్ రెడ్డి, జడ్పిటిసి గోకుల్ కృష్ణ రెడ్డి, ఎంపిపి శెట్టి ప్రభాకర్, వైసిపి నాయకులు జగదీశ్వర రెడ్డి, వైస్ ఎంపిపి రంగారావు, ఎంపిటిసి జమ్రుద్ బి, సర్పంచ్ పాణ్యం దూదేకుల బావమ్మ, దూదేకుల ఖాసిం, మూళ్ళ ఇస్మాయిల్ ఉన్నారు.



సజీవ దహనమైన గేదెలు

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు సిద్ధం చేయండి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలో ఈ నెల 11 నుండి 21 వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం శ్రీశైలంలోని అన్నపూర్ణ భవనం పక్కన గల సిసి కంట్రోల్ రూమ్‌లో జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారిచక్రపాణిరెడ్డి, జాయింట్ కమిషనర్ అండ్ చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్, దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్. లవన్నలతో కలిసి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్సవాల పటిష్ట నిర్వహణకు శ్రీశైల ఆలయాన్ని 10 జోన్లు, 40 సెక్టార్లుగా విభజించి జిల్లాస్థాయి అధికారులకు ఇంచార్జులుగా నియమించామని చెప్పారు. ప్రధానంగా ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, పారిశుధ్యం, తాగు నీటి సదుపాయం తదితర అంశాలపై అప్పగించిన విధులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి నిర్వర్తించాలని సంబంధిత జోనల్ అధికారులను ఆదేశించారు. ఏ ఒక్క



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

చిన్న పొరపాటు జరగకుండా సంబంధిత అధికారులతో కో ఆర్డినేట్ చేసుకోవాలని, ఏ సమస్య ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. బ్రాహ్మణ కొట్కూరు నుండి శ్రీశైలం వరకు గతంలో సూచించిన విధంగా 24 ప్రదేశాలలో తాత్కాలిక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాతాళగంగ, లింగాలగట్టు ప్రాంతాలలో పుణ్య స్నానాలాచరించేందుకు అనుమతిస్తున్న నేపథ్యంలో ఇందుకు సంబంధించి 338 మంది గజ ఈతగాళ్ళ సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న మాట్లాడుతూ భక్తులకు వేగంగా స్వామివారి దర్శనం అయ్యేలా నాలుగు రకాల క్యూలైన్లను ఏర్పాటు చేశామని కలెక్టర్‌కు వివరించారు. ఈ నెల 13న దుర్గామల్లేశ్వరస్వామివారి దేవస్థానం, 14న కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం, తిరుమల తిరుపతి దేవస్థానం వారు, 15న ప్రభుత్వం తరుపున స్వామి అమ్మవార్ల పట్టువస్త్రాలను సమర్పిస్తారన్నారు. జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ భారీ వాహనాలను అటవీమార్గంలో అనుమతించకుండా డైవర్ట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రకాశం, నాగర్ కర్నూలు, కర్నూలు జిల్లాల ట్రాన్స్‌ఫోర్ట్, సంబంధిత ట్రాఫిక్ డిస్పీలను ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఓ పుల్లయ్య, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు కైలాస ద్వారం వద్ద దేవస్థానం ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరాన్ని కలెక్టర్, ఎస్పీలు సందర్శించి స్వయంగా భక్తులకు అన్నదాన వితరణ చేశారు. అలాగే పాతాళ గంగ, ఆర్‌టిసి బస్టాండ్, ఆగమ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మల్లమ్మ మందిరం, కైలాస ద్వారం సమీప ఆవరణలలో ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలను వారు తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు.



మాట్లాడుతున్న నాయకులు

నేడు బ్లాక్ డేను జయప్రదం చేయండి

- వ్యకాసం, రైతు సంఘం, సిఐటియు

ప్రజాశక్తి - నందికొట్కూరు

కేంద్ర బడ్జెట్లో ఉపాధి హామీకి నిధులు తగ్గించి పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న చర్యలను నిరసిస్తూ నేడు చేపట్టే బ్లాక్ డేను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పి.పకీర్ సాహెబ్, రైతు సంఘం జిల్లా నాయకులు పి.వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా నాయకులు కె.భాస్కర్ రెడ్డి కోరారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ నేడు జరిగే నిరసన కార్యక్రమంలో రైతులు, ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విద్యార్థి బస్సు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి - నందికొట్కూరు

జూపాడుబంగ్లాలోని మోడల్ స్కూల్, హైస్కూల్ పాఠశాలలకు విద్యనభ్యసించడానికి వెళ్తున్న పోతులపాడు, చాబోలు గ్రామాల విద్యార్థులకు ఆర్‌టిసి వారు విద్యార్థి బస్సు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తోగురు ఆర్థర్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు డక్క కుమార్, శివ మాట్లాడుతూ 50 మంది పైగా విద్యార్థులు చాబోలు, పోతులపాడు గ్రామాల నుండి జూపాడుబంగ్లాలోని మోడల్ స్కూల్, హైస్కూల్ పాఠశాలలకు వెళు తున్నారని చెప్పారు. గ్రామాలకు బస్సు లేనందువలన ఆటోలకు నెలసరి చార్జి మాట్లాడుకుని ప్రయాణం చేస్తున్నారని చెప్పారు. ఒక్కొక్కరికి రోజుకు 60 రూపాయలు చొప్పున విద్యార్థులు ఆటో వారికి చెల్లిస్తున్నారని తెలిపారు. రోజు చార్జీలు చెల్లించలేక విద్యార్థులు ఇంటివద్దనే ఉండి చదువుకు దూరమవుతున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని విద్యార్థి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే విద్యార్థులకు బస్సు ఏర్పాటు చేయాలని నందికొట్కూర్ డిపో మేనేజర్‌కు తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ ఉపాధ్యక్షుడు హరి వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సుండిపెంట పంచాయతీ ఏర్పాటుపై కలెక్టర్ ఆరా

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

సుండిపెంట గ్రామ పంచాయతీ ఏర్పాటుపై జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ బుధవారం సంబంధిత శాఖల అధికారులతో ఆరా తీశారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలంలో ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం సుండి పెంటలోని ఇరిగేషన్ శాఖ కార్యాలయం చేరుకున్నారు. ఇరిగేషన్, ఇతర శాఖల అధికారులతో సుండిపెంట పంచాయతీ ఏర్పాటుపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో ఎన్ని ప్రభుత్వ గృహాలు ఉన్నాయి, ఏ మేరకు అవసరం ఉన్నది, పంచాయతీ చేస్తే ఏ మేరకు ఉపయోగాలు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ సుండిపెంటలోని సమీకృత గిరిజనాభివద్ధి సంస్థ ఐటీడీఏ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయంలోని సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీశైలం డ్యాం అతిథి గృహం, స్విచ్ యార్డ్, నీలంపాటి అమ్మవారి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. కలెక్టర్ వెంట ఇరిగేషన్ శాఖ డిఎస్ఇ గంగాధర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులు, ఆర్డిఓ దాసు, తహశీల్దారు రాజేంద్ర సింగ్‌లు ఉన్నారు.



ఎమ్మెల్సీగా పోతుల నాగరాజును గెలిపించండి

- ప్రజా సంఘాల నేతలు

ప్రజాశక్తి - బేతంచర్ల

ఉద్యమమే ఊపిరిగా, ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.ఎల్లయ్య, వైబి వెంకటేశ్వర్లు, అంగన్వాడీ జిల్లా అధ్యక్షురాలు జి.షేబా రాణి కోరారు. బుధవారం బేతంచర్లలో సిఐటియు నాయకులు ఎస్ సాదిక్ హుస్సేన్ ఆధ్వర్యంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును గెలిపించాలని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి పోతుల నాగరాజును గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక నిరుద్యోగ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ బడుగు బలహీన వర్గాల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్న ఉద్యమ నేతలు, ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజులను గెలిపించుకోవాల్సిన అవసరం మన అందరిపై ఉందన్నారు. అనంతరం గోడ పత్రికలను విడుదల చేశారు. ప్రజా సంఘాల నాయకులు గురుజార్బి, ఆశ వర్కర్ల మండల కార్యదర్శి నాగేంద్రమ్మ, రమణమ్మ, శ్రీనివాసులు, నాగేశ్వరరావు, నారాయణ, గఫార్, వెంకట్ రమణ, రాజబాబు, చిన్న నరసింహులు, చిన్న వెంకటేశ్వర్లు, ఎస్ మాలిక్ భాష, డి రాజు, స్వామి నాయుడు, భాస్కర్, రాముడు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు. **ప్యాపిలి** : మార్చిలో శాసనమండలికి జరిగే ఎన్నికలలో రాయలసీమ పట్టభద్ర నియోజకవర్గానికి (ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్) ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ పోతుల నాగరాజును గెలిపించాలని సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రహిమాన్ పట్టభద్రులను కోరారు. బుధవారం పోతుల నాగరాజును గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి డి.అక్బర్ బాషా, ఎలక్ట్రిషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పి.శ్రీనివాసులు షేక్, ఇలియాజ్, గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ప్రధాన కార్యదర్శి రామానాయుడు, గ్రామపంచాయతీ కార్మికుల సంఘం నాయకులు రంగస్వామి, కార్మికులు పాల్గొన్నారు.



గోడ పత్రికలను విడుదల చేస్తున్న నాయకులు

బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - మహానంది

మహానందీశ్వరుని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్ రెడ్డి, పాలక మండలి చైర్మన్ మహేశ్వర్ రెడ్డిల ఆధ్వర్యంలో బుధవారం స్వామివారి కల్యాణ మండపంలో పూజా కార్యక్రమం నిర్వహించి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ నుండి జరగబోవు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో పాల్గొనే వేలాది మంది భక్తుల కోసం క్షేత్రంలో ప్రత్యేక ఏర్పాట్లను చేశామన్నారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, ఆలయ వేద పండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మ దేవర

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని మీరాపురం గ్రామంలో పెద్దమ్మ జాతర బుధవారం గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున బోనాలతో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి పెద్దమ్మ జాతరలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు కాటసాని ప్రసాద్ రెడ్డి, మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గుండం శేషిరెడ్డిలకు యాగంటి దేవస్థానం చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, నాయకులు మనోహర్ రెడ్డి, బత్తుల రామ్మోహన్ రెడ్డి, బండి జగదీశ్వర రెడ్డి, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అలాగే మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి, టిడిపి డోన్ ఇన్చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి, తెలుగు యువత నాయకులు కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డిలకు యాగంటి దేవస్థానం మాజీ చైర్మన్ బత్తుల బాలిరెడ్డి, నాయకులు రేగటి నాగిరెడ్డి, యామా నాగిరెడ్డి, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. యాగంటి దేవస్థానం మాజీ చైర్మన్ దోనపాటి యాగంటి రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గాలి మద్దిలేటి రెడ్డి, టిడిపి వాణిజ్య విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్యతోపాటు అధిక సంఖ్యలో ప్రజలు పెద్దమ్మ జాతరలో పాల్గొన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ సుబ్బారాయుడు, ఎస్సైలు రామిరెడ్డి, అవుకు ఎస్సై జగదీశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.





పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి - ప్యాపిలి : ప్యాపిలి మండలంలోని బావిపల్లె క్రాస్ రోడ్డు వద్ద లద్దగిరి శ్రీనివాసులు (52) దారుణ హత్యకు గురయ్యాడు. వివరాలు.. బుధవారం తన సొంత గ్రామం కొచ్చర్వు నుంచి పని నిమిత్తం హుసేనాపురంకు స్కూటిపై బయలుదేరాడు. బావిపల్లి క్రాస్ దగ్గరకు రాగానే కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కట్టెలతో, పిడుబాకుతో దాడి చేశారు. శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందాడు. హత్యకు కారణం మైనింగ్ వ్యాపారం అని తెలుస్తుంది. భార్య ఫిర్యాదు మేరకు జలదుర్గం ఎస్సై నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సంఘటన స్థలాన్ని డోన్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి సందర్శించి డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించారు.

వెలుగు సిసి మద్దిలేటి మృతి

ప్రజాశక్తి - బేతంచర్ల : బేతంచెర్ల పట్టణం దుర్గా పేట కాలనీకి చెందిన వెలుగు సిసి మిద్దె మద్దిలేటి బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడికి భార్య రామలక్ష్మి ఉన్నారు. విషయం తెలిసిన నంద్యాల డిపిఎం శ్రీనివాసులు, రాజగోపాల్, బేతంచెర్ల ఏబీఎం లింగమయ్య గౌడ్, అవుకు, బేతంచెర్ల మండల వివోఏలు కలిసి 60 వేల రూపాయలను మద్దిలేటి భార్యకు అందజేశారు.

10న అంగళ్ల నిర్వహణకు బహిరంగ వేలం

ప్రజాశక్తి - పాణ్యం : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కొత్తూరు సుబ్బారాయుడు స్వామి ఆవరణలో ఈ నెల 10న టెంకాయల అంగడి, గాజులు, పూల అంగల్ల నిర్వహణకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ రామకృష్ణ తెలిపారు. టెంకాయల అంగడి వేలం పాటలో పాల్గొనే వారు లక్ష రూపాయలు, మిగతా అంగళ్ళ వేలం పాటలో పాల్గొనే వారు పదివేల రూపాయలు దరావతు చెల్లించాలని, హెచ్చు పాటదారుడు ఆ రోజే మొత్తం చెల్లించాలని చెప్పారు. ఈ బహిరంగ వేలం నంద్యాల దేవదాయ శాఖ అధికారులు, గ్రామ ప్రజలు, పెద్ద మనుషుల సమక్షంలో దేవాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆర్‌బికెలను ఎఒ తనిఖీ

ప్రజాశక్తి - రుద్రవరం : మండలంలోని మందలూరు, ఎర్రగుడిదిన్నె, పేరూరు, గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను మండల వ్యవసాయ శాఖ అధికారి బి జ్యోతి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో రైతులు రబీలో సాగుచేసిన పంటలు నమోదు కార్యక్రమం దాదాపు పూర్తి కావచ్చిందన్నారు. ఈకేవైసీ చేయించుకొని రైతులు ఈనెల 25 నాటికి చేయించుకోవాలని తెలిపారు. ఆమె వెంట ఆయా రైతు భరోసా కేంద్రాల వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

నాడు-నేడు పనులు నాణ్యతతో చేపట్టాలి

ప్రజాశక్తి - పగిడ్యాల : మనబడి నాడు-నేడు పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని ఎంఇఒ సుభాన్ ఉపాధ్యాయులకు, కమిటీ సభ్యులకు సూచించారు. బుధవారం మండలంలోని బీరవోలు గ్రామంలోని ఎంపిపి పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నాడు నేడు పథకంతో పాఠశాలలకు మహర్దశ వచ్చిందన్నారు. అనంతరం విద్యార్థులు రాస్తున్న సిబిఎ పరీక్షలను పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు.

ప్రజాశక్తి
www.prajasakti.com


వాహనాలు వేలం నిర్వహిస్తున్న దృశ్యం

ద్విచక్ర వాహనాలు వేలం

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు పోలీస్ స్టేషన్ ఆవరణంలో తాసిల్దార్ రత్న రాధిక, సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్సై అశోక్ సమక్షంలో ఏడు మోటర్ సైకిళ్లకు బుధవారం వేలంపాట నిర్వహించారు. మొత్తం రూ.1,11,668 ఆదాయం వచ్చిందని ఎస్సై అశోక్ తెలిపారు. **పాణ్యం :** పాణ్యం పోలీసు స్టేషన్ పక్కన గల పాత క్వార్టర్స్ దగ్గర ఖాళీ స్థలంలో చాలా రోజుల నుండి ఉన్న 16 వాహనాలకు బుధవారం పోలీస్ స్టేషన్‌లో సిఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ఈ వేలం ద్వారా రూ. 2,43,924 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఎస్ఐ సుధాకర్ రెడ్డి, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా విధానంలో మార్గదర్శకుడు డాక్టర్ జాకీర్ హుస్సేన్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

విద్యా విధానంలో భారత స్వాతంత్ర సమరయోధుడు జాకీర్ హుస్సేన్ మార్గదర్శకుడని ప్రైవేట్ పాఠశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్ నంద్యాల డివిజన్ అధ్యక్షులు అమీర్ భాష అన్నారు. బుధవారం పట్టణంలోని విజ్ఞాన భారతి ఉన్నత పాఠశాల లో కరస్పాండెంట్ శివకుమార్ ఆధ్వర్యంలో డాక్టర్ జాకీర్ హుస్సేన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమీర్ భాష మాట్లాడుతూ డాక్టర్ జాకీర్ హుస్సేన్ ప్రముఖ స్వాతంత్ర యోధుడిగా గాంధీజీతో చేతులు కలిపి బ్రిటిష్ వారిని ఎదిరించేందుకు బేసిక్ విద్య అవసరమని చాటిచెప్పి భారతదేశంలో విద్యా విధానంలో మార్గదర్శకుడిగా ఖ్యాతి పొందారన్నారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, రవి తదితరులు పాల్గొన్నారు.

అర్చక వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డు మెంబర్లుగా ఆత్రేయబాబు, కోటపాడు శ్రీనివాసాచార్యులు

ప్రజాశక్తి - సిరివెళ్ల

విజయవాడలోని సెక్రటేరియట్‌లో చీఫ్ సెక్రటరీ ప్రవీణ్ కుమార్, టిటిడి ఇఒ ధర్మారెడ్డి ఆధ్వర్యంలో ఆత్రేయ బాబు, కోటపాడు శ్రీనివాసులు అర్చక వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డ్ మెంబర్లుగా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా దేవదాయ శాఖ కమిషనర్ హరి జవహర్ లాల్‌ని కలసి, గొల్లపూడిలోని దేవదాయ శాఖ ఆఫీసులో సన్మానించారు. కార్యక్రమంలో అర్చక సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు గుమ్మరాల నరసింహయ్య, కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రతినిధులు సూర్యనారాయణ చార్యులు, నేరేడుచర్ల తిరుమలయ్య, యాలూరు పార్థు, నాయకులు మదనగోపాల్, ఉల్లిందకొండ కేశవయ్య, అర్చకులు పాల్గొన్నారు.



నారసింహుని సేవలో శ్రీ నృసింహ సేవా వాహిని

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

శ్రీ నృసింహ సేవా వాహిని బృందం అద్భుతంగా జరిగే అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి పారువేట ఉత్సవాలలో ఎనలేని సేవలందించారు. పార్వేట ఉత్సవాలలో భాగంగా ఉయ్యాలవాడ మండలం సర్వాయి పల్లిలో ప్రతి సంవత్సరం స్వామి వారికి అభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగానే బుధవారం లక్ష్మీ నరసింహ స్వామి వారికి విశేష తిరుమంజనం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి వచ్చిన భక్తులకు, బోయిలకు, నృసింహ దీక్షా పరులకు శ్రీ నృసింహ సేవా వాహిని సంస్థ ఆధ్వర్యంలో సుమారు 1300 మందికి అన్నప్రసాదాన్ని అందించారు. అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని మండలి విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి, అహోబిలం దేవస్థానం ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు ప్రారంభించారు. ఇంతటి మహత్తర కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాద వితరణ చేసే భాగ్యం కలగడం మా సంస్థ చేసుకున్న అదృష్టమని శ్రీ నృసింహ సేవా వాహిని కర్నూల్ జిల్లా చైర్మన్ రవికాంత్ చౌదరి బృందం అన్నారు. **ఉయ్యాలవాడ :** మండలంలోని సర్వాయిపల్లి గ్రామంలో పార్వేట ఉత్సవ పల్లకి స్వాములవారికి మఠం పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ ఆధ్వర్యంలో పంచామృత అభిషేకం చేశారు. ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. గ్రామానికి చెందిన సన్నతి సుబ్రమణ్యం, మురళి, సురేష్‌లు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. సర్పంచ్ సరాజు ఉమా, వైసిపి నాయకులు దస్తగిరి, గిరిధర్, ఆళ్లగడ్డ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐలు సత్యనారాయణ, తిరుపాలు, నరసింహుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న గంగుల ప్రభాకర్ రెడ్డి



సర్వాయి పల్లెలో పూజలు నిర్వహిస్తున్న

విద్యార్థినుల భవిష్యత్తుకు ఆర్‌డిటి బంగారు బాట : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఎన్నో ఏళ్లుగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆర్డిటి సహకారంతో పరిష్కరించామని, విద్యార్థినుల భవిష్యత్తుకు ఆర్డిటి బంగారు బాటలు వేసిందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి అన్నారు. బుధవారం నంద్యాల పట్టణంలోని ఎస్‌వైవిసిపి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో రూ. 3 కోట్లతో నూతనంగా నిర్మించిన 12 గదులను ఆర్డిటి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ మంచో ఫెర్రర్, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని ఒకటో వార్డు పివి నగర్‌లో ఆర్‌డిటి సౌకర్యంతో 120 గృహాలను నిర్మించడానికి ముందుకు వచ్చారని, వారికి నంద్యాల నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆర్డిటి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ మంచో ఫెర్రర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, మున్సిపల్ చైర్మన్ మాబున్నీసా, రాష్ట్ర దృశ్య కళల డైరెక్టర్ సునీత అమృత రాజ్, ఎపిపిడీసీఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ సోమశేకరప్ప, రిటైడ్ ప్రిన్సిపల్ సునీత, దాతలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.


నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే , ఎమ్మెల్సీ,

విదేశీ విద్య పథకాన్ని నీరుగార్చిన సిఎం : టిడిపి

ప్రజాశక్తి - నందికొట్కూరు

విదేశీ విద్య పథకానికి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అనేక ఆంక్షలు విధిస్తూ నీరుగార్చుతున్నారని, పేద బడుగు బలహీన విద్యార్థులకు విద్యను దూరం చేస్తున్నారని టిడిపి నాయకులు పేర్కొన్నారు. బుధవారం నందికొట్కూరులో పట్టణ అధ్యక్షులు పాణ్యం వేణుగోపాల్ ఆధ్వర్యంలో సిఎం తీరును నిరసిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం ఎమ్మార్వో ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి అధికార ప్రతినిధి డాక్టర్ చిన్న వెంకటస్వామి మాట్లాడారు. విదేశీ విద్య పథకానికి అంబేద్కర్ పేరును తొలగించి జగన్ పేరు పెట్టుకుని, అంబేద్కర్ మహాశయుడిని అవమానపరిచారని, ఇలాంటి వ్యక్తిని సమాజం సహించదని, తగిన బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, ఐ టీడీపీ అధ్యక్షులు ముర్తుజావలి, మైనారిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి శకీల్ అహమద్, నాయకులు పాల్గొన్నారు. **డోన్ :** వైసిపి ప్రభుత్వం పేద విద్యార్థులు విదేశాల్లో చదువుకునే అవకాశాలు కల్పించాలని టిడిపి డోన్ పట్టణ అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. నియోజకవర్గ టిడిపి అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు ఎంఆర్వో ఆఫీస్‌లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. టిడిపి జిల్లా కార్యదర్శి అబ్బిరెడ్డి పల్లె గోవిందు, మండల అధ్యక్షులు సలీంద్ర శ్రీనివాసులు యాదవ్, నియోజకవర్గ రైతు కమిటీ అధ్యక్షులు మల్లయ్య, మండల ప్రధాన కార్యదర్శి ఎల్ఐసి శ్రీరాములు, బిసి సెల్ అధ్యక్షులు రామాంజనేయులు, ఎర్రగుంట్ల మద్దిలేటి, ఎర్రగుంట్ల రంగస్వామి, సత్యం రాజు, ఖాజా, ఉడుములపాడు నాగేంద్ర, బిసి సెల్ పట్టణ ఉపాధ్యక్షులు జిలేబి ధను, ధర్మవరం వెంకట నాయుడు తదితరులు పాల్గొన్నారు.


డోన్ : వినతి పత్రం అందిస్తున్న టిడిపి నాయకులు

ప్రజలపై వైసిపి భారాలు : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆత్మకూర్

వైసిపి ప్రభుత్వం నిత్యవసర ధరలను అదుపు చేయకపోవడంతో సామాన్య, మధ్య తరగతి పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని శ్రీశైల మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం ఇదేం కర్మ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అర్బన్ కాలనీ వెంగళరెడ్డి కాలనీలో ఆయన ఇంటింటి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లిన సందర్భంగా పేద ప్రజలు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అప్పుల్లో అగ్రస్థానంలో ఉందన్నారు. ధరల రేట్లు పెంచడంలోనూ మొదటి స్థానంలో ఉందన్నారు. మరోసారి ప్రజలు తప్పు చేయకుండా టిడిపిని అధికారంలోకి తెచ్చుకోవాల్సిన అవసరం, బాధ్యత ప్రజలపై ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, రమేష్ గౌడ్, రమణ, శివకుమార్, టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు జడ్పీ వేణుగోపాల్, అబ్దుల్లాపురం భాష, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు కరీముల్లా, అస్ కమిటీ మాజీ చైర్మన్, మైనార్టీ నాయకులు షఫీవుల, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ తిరుపమయ్య తదితరులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** వైసిపి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని టిడిపి సీనియర్ నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు, మాజీ మహానంది ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కంచర్ల సురేష్ రెడ్డి, నందిపాటి నరసింహారెడ్డి, మల్లేశ్వర్ రెడ్డి, తాటికొండ బుగ్గ రాముడు అన్నారు. బుధవారం మండలంలోని నారాయణపురం, చిన్నదేవలా పురం, పరకాల కాలనీలలో ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు కంచర్ల మనోహర్ రెడ్డి, పాలశంకర్, లింగారెడ్డి, తాటికొండ మహేష్, సుబ్బారెడ్డి, జాకీర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బండి ఆత్మకూరు మండలంలో...



వారపు సంత మార్కెట్‌ను పరిశీలిస్తున్న ఇఒఆర్‌డి, సర్పంచు

మార్కెట్‌లోనే కూరగాయలు అమ్ముకోవాలి

ప్రజాశక్తి - పగిడ్యాల

వారపు సంత మార్కెట్‌లోనే కూరగాయలు అమ్ముకోవాలని ఇఒఆర్‌డి పుల్లయ్య, సర్పంచు పెరుమాళ్ళ శేషన్న కూరగాయల అమ్మకందారులకు సూచించారు. బుధవారం పగిడ్యాల వారపు సంతను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వారపు సంతరోజు రహదారుల వెంట కూరగాయల అంగళ్లు ఏర్పాటు చేసుకుంటే వాహనాలకు, బాటసారులకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. సంత మార్కెట్ కోసం ఏర్పాటు చేసిన స్థలంలోనే కూరగాయలు అంగళ్ళను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సంత మార్కెట్‌లో ఎల్ఇడి బల్బులు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఉపేంద్రరెడ్డి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్



ఈ నెల 11 నుండి జరగనున్న శ్రీశైలం శివరాత్రి బ్రహ్మోత్సవాలతో పాటు వివిధ శైవ క్షేత్రాలలో జరగనున్న ఉత్సవాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి. వెంకట రమణ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీశైలం పరిసర ప్రాంతాల్లో 11 మెడికల్ క్యాంపులు, కాలినడకన వచ్చే శివ భక్తుల కోసం బ్రాహ్మణకొట్కూరు నుండి వెంకటాపురం, పెచ్చెరువు వరకు 13 వైద్య శిబిరాలు, శ్రీశైలం పరిసర ప్రాంతాల్లోని 4 మెడికల్ క్యాంపుల్లో 24/7 వైద్య సేవలు ఉంటాయన్నారు. మిగిలిన మెడికల్ క్యాంపులు 2 షిఫ్టల వారీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాదాపు 30 మంది వైద్యులను కేటాయించామని వెల్లడించారు.

చెంచుల స్థితిగతులపై రెడ్‌క్రాస్ అధ్యయనం

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

రెడ్‌క్రాస్ రాష్ట్ర కమిటీ సూచన మేరకు బుధవారం నంద్యాల జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, కార్యవర్గ సభ్యుడు యాకుబ్‌లు బుధవారం పచ్చర్లలో అడవి బిడ్డల (చెంచుల) స్థితిగతులపై అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా దస్తగిరి పర్ల మాట్లాడుతూ ప్రతినెలా ఒక జిల్లాలోని అడవి బిడ్డల కోసం వైద్య శిబిరం, సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అందులో భాగంగా సిరివెళ్ల మండలంలోని పచ్చర్ల గ్రామంలో పర్యటించి అక్కడి చెంచుల కుటుంబాలతో మాట్లాడామన్నారు. ఇక్కడ దాదాపు 105 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, వీరంతా అడవిపైనే ఆధారపడి బతుకుతున్నారని, ఈ విషయాలన్నీ రాష్ట్ర కమిటీకి నివేదికలో పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో మహిళా రక్షణ సేవా సంస్థ అధ్యక్షుడు మణికంఠ, చెంచు యువకులు పాల్గొన్నారు.


అడవి బిడ్డలతో మాట్లాడుతున్న నంద్యాల రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి

అహోబిలం బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి : ప్రభుత్వ విప్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అహోబిల క్షేత్రంలో ఈనెల 24 నుండి వచ్చే నెల 7 వరకు జరిగే బ్రహ్మోత్సవాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి సూచించారు. బుధవారం నంద్యాలలోని స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో అహోబిలం బ్రహ్మోత్సవాలపై ఆర్డీఓ శ్రీనివాసులు, ఆళ్లగడ్డ డీఎస్పీ సుధాకరరెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్తు, రవాణా, టాయిలెట్స్ సౌకర్యాలు భక్తులకు అందుబాటులో ఉండాలని సూచించారు. బస్టాండ్ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచి ప్రయాణికులు, భక్తులు అక్కడే బస్సులు దిగి, ఎక్కేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఆర్డీవో శ్రీనివాసులు మాట్లాడారు. ఆళ్లగడ్డ డీఎస్పీ సుధాకరరెడ్డి మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసు కోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో ఆళ్లగడ్డ తహశీల్దార్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు రూ.15 వేలు వేతనమివ్వాలి : ఆవాజ్

ప్రజాశక్తి - నంద్యాల : రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న వాలంటీర్లకు కనీసం 15 వేల రూపాయలు వేతనం, పిఎఫ్ అమలు చేయాలని ఆవాజ్ జిల్లా కార్యదర్శి మస్తాన్ వలి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సంవత్సరంలో 200 రోజులు రెగ్యులర్‌గా పని చేసిన వారిని రెగ్యులర్ చేయాలని, ఆ విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్‌సి బాలికల వసతి గృహాన్ని ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

- సరిగా లేని మౌలిక వసతులు, భోజన మెనూపై ఆగ్రహం
- వార్డెన్ విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదంటూ జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఫిర్యాదు

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వసతి గృహంలో విద్యార్థినులకు మౌలిక వసతులు సక్రమంగా లేకపోవడం, మెనూ ప్రకారం భోజనం లేకపోవడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థినులతో హాస్టల్‌లోని సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. బాత్‌రూం సౌకర్యం లేక ఆరుబయటే స్నానాలు చేస్తున్నామని బాలికలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. టాయ్ లెట్స్‌లలో నీరు రాకపోవడం, మెనూ ప్రకారం భోజనం, టిఫిన్ పెట్టకపోవడం, వార్డెన్ స్థానికంగా ఉండడం లేదని చెప్పారు. ఎమ్మెల్యే వెంటనే జిల్లా కలెక్టర్‌కు హాస్టల్ వార్డెన్ వనజాక్షిపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంటే క్షేత్ర స్థాయిలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తూ ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నారని పేర్కొన్నారు. ఈనెల 13న జరిగే సిఎం సమావేశంలో అధికారుల మీద ఫిర్యాదు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని హాస్టళ్లను తాను తరచూ ఆకస్మిక తనిఖీలు చేస్తానని, విధుల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, కైప ప్రతాప్ రెడ్డి, చెర్వుపల్లె పుల్లయ్య, అంబటి రవి కుమార్ రెడ్డి, ఎస్సైలు పాల్గొన్నారు.



గిరిజనుల ద్రోహి ఎస్‌టి కమిషన్ చైర్మన్

- 20వ వార్డు వైసిపి కౌన్సిలర్ మానిపాటి మురళి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

గిరిజనులకు నష్టం కలిగించే జీవో నెం.52పై ఇప్పటివరకు స్పందించని ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభ రవిబాబు గిరిజన ద్రోహి అని నంద్యాల పట్టణంలోని 20వ వార్డు వైసీపీ కౌన్సిలర్ మానిపాటి మురళి అన్నారు. ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చడం ఎస్టీ కమిషనర్ చైర్మన్ కుంభ రవిబాబుకు సమ్మతమా లేక వ్యతిరేకమా తేల్చి చెప్పాలన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో జరిగిన జిల్లా గిరిజన నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనులకు న్యాయం చేయలేని ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభ రవిబాబు తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జీవో నెం. 52కు, ఏక సభ్య కమిషన్‌కు వ్యతిరేకంగా జిల్లా గిరిజన నాయకులతో కలిసి త్వరలో శ్రీశైలం నుండి తిరుపతి వరకు పాదయాత్ర చేపట్టబోతున్నట్టు తెలిపారు. సమావేశంలో న్యాయవాది మానిపాటి రామకృష్ణ, ఏపి వైఎస్ఎస్ ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు పెనుగొండ నాగార్జున, మేడసారి వెంకటరాముడు, నాసరి నాగరాజు, వై సుంకన్న, కాలింగిరి పెద్ద ఎల్లయ్య, పోల సాలన్న, సురసుర లింగన్న, సుబ్బరాయుడు, రమణ, వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మురళి

అటవీ సంరక్షణే ధ్యేయంగా పని చేయాలి : రేంజర్

బండి ఆత్మకూర్

అటవీ సంరక్షణే ధ్యేయంగా ఫైర్ వాచర్లు పని చేయాలని రేంజర్ నసీరుజా తెలిపారు. బుధవారం ఎన్ఆర్ కుంట బేస్ క్యాంపు వద్ద ఫైర్ వాచర్లతో సమావేశం నిర్వహించారు. రేంజర్ మాట్లాడుతూ ఫైర్ వాచర్లు సాసర్ ఫీట్లకు నీళ్లు పోయడం, అగ్ని ప్రమాదాన్ని ఆపడం, ఎక్కువ అగ్నిప్రమాదాలు జరిగే చోట అప్రమత్తంగా ఉండి పై అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. శివరాత్రి సీజన్లో భక్తులు కాలినడకతో గుండ్ల బ్రహ్మేశ్వరం వెళ్తారని, వారి వద్ద అగ్గిపెట్టెలు, ప్లాస్టిక్ వస్తువులు ఉండకుండా తనిఖీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఒలు తేజ, రవీంద్ర, గాడ్స్ రామకృష్ణ, రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి : ఎంపిపి

ప్రజాశక్తి - మహానంది : గ్రామాలలో నెలకొన్న తాగునీటి సమస్యలను త్వరగా పరిష్కరించాలని మండల అధ్యక్షురాలు బుడ్డా రెడ్డి యశస్విని అన్నారు. మహానంది మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం బుక్కాపురం గ్రామంలోని మండల మహిళ సమైక్య కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు వారి ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వచ్చేది వేసవికాలం కావున గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జడ్పిటిసి కెవి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా సూర్యనందికి బస్సు వేయాలని, బుక్కాపురం గ్రామం దగ్గర బస్సులు ఆపే విధంగా చూడాలని ఏపీఎస్ ఆర్టీసీ వారిని కోరారు. బొల్లవరం ఎంపీటీసీ మాట్లాడుతూ గ్రామ ముస్లిం కాలనీలో నీటి సమస్య విపరీతంగా ఉందని పరిష్కరించాలని, చేతిపంపులు కూడా రిపేర్ చేయించాలని కోరారు. ఎంపిడిఒ శివ నాగజ్యోతి మాట్లాడారు. పారిశుధ్యం పై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇంచార్జి ఎంపిడిఓ శివ నాగజ్యోతి, తహసిల్దార్ జనార్దన్ శెట్టి, మండల వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వర్ రెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

లే... నాన్న ఇంటికి వెళదాం...

ప్రజాశక్తి - రుద్రవరం :


మద్యం మత్తులో ఉన్న తండ్రిని లేపుతున్న కుమారుడు

పిల్లలు తప్పటడుగులు వేసినా, తప్పులు చేసినా వారిని సరియైన మార్గంలో నడిపిస్తుంటారు తల్లి దండ్రులు. కానీ ఇందుకు విరుద్ధంగా కన్న తండ్రే తప్పతాగి నడిరోడ్డుపై పడిపోతున్న ఘటన బుధవారం రుద్రవరం మండలంలో చోటు చేసుకుంది. వివరాలు.. మండలంలోని చిన్న కంబలూరు గ్రామానికి వ్యక్తి ఏడవ తరగతి చదువుకుంటున్న తన కుమారుడిని పొలం దగ్గరకు తీసుకెళ్లి పనులు చేయించాడు. అదే సమయంలో తండ్రి వెంట తెచ్చుకున్న మద్యాన్ని కడుపునిండా తాగి కళ్ళు కనపడకుండా నడిరోడ్డుపై పడిపోయాడు. ఇది గమనించిన కుమారుడు తన తండ్రి ఇంటికి ఎలా తీసుకెళ్లాలో తెలియక నాన్న పదా ఇంటికి వెళ్దాం అంటూ గంటల తరబడి కన్నీరు కారుస్తూ బతిమాలుకుంటున్న దృశ్యం చూపరులను కలచివేసింది.

చేతి రాత అందంగా ఉండాలి : ప్రిన్సిపల్

రుద్రవరం : పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు రావాలంటే చేతి రాత అందంగా ఉండాలని ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వర రావు తెలిపారు. బుధవారం స్థానిక మోడల్ పాఠశాలలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును మార్చేది వాళ్ళ చేతిరాత అన్నారు. అందమైన చేతిరాత అందరికీ సాధ్యమేనని అన్నారు. చేతి రాత బాగుంటే రాబోయే పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు వస్తాయని తెలిపారు.

సకాలంలో రుణాలు చెల్లిస్తే సున్నా వడ్డీ : ఏపిఎం

జూపాడుబంగ్లా : సకాలంలో రుణాలు చెల్లించే సంఘాల మహిళలకు సున్నా వడ్డీని ప్రభుత్వం క్రమం తప్పకుండా అమలు చేస్తోందని ఏపీఎం అంబమ్మ తెలిపారు. బుధవారం తర్తూరు, మండ్లెం, తంగెడంచ, భాస్కరపురం గ్రామాల్లోని పొదుపు సంఘాల రికార్డులను ఏపీఎం తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణపై బుక్ కీపర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బ్యాంకు రుణాల వసూళ్లు, సీఐఎఫ్, వీఆర్ఎఫ్, స్త్రీనిధి, ఉన్నతి, బ్యాంకు లింకేజీ అన్ని అప్పులు రెగ్యులర్‌గా చెల్లించాలని చెప్పారు. కార్యక్రమంలో సీపీ నాగన్న, ఎల్‌సీ ఇస్మాయిల్, అకౌంటెంట్ రమేష్, వీఏవోలు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి

చాగలమర్రి : గ్రామాల్లో జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎపిడి సాంబశివరావు తెలిపారు. చాగలమర్రిలోని చాగలమ్మ చెంచు కాలనీలో చెంచులకు ఉపాధి పనులపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక కాలనీలో జాబ్ కార్డు కలిగి ఉపాధి పనులకు వెళ్ళకుండా ఉన్న వారికి పనులపై అవగాహన కల్పించారు. ఏపీవో నిర్మల, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణులకు కొండంత ఆసరాగా జగనన్న చేదోడు

బనగానపల్లె : నాయీబ్రాహ్మణులకు కొండంత అండగా జగనన్న చేదోడు నిలిచిందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాసంలో రాష్ట్రంలో 610 దేవస్థానాల్లో పాలకమండలిలో కార్యవర్గ సభ్యులుగా నాయి బ్రాహ్మణులను నియమించే విధంగా సిఎం జీవో జారీ చేయడంతో నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు మధు సుదన్, 6వ వార్డు మెంబెర్ సురేష్, నాయీబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షులు రాము, నాగేష్ మద్దిలేటి, కార్తీక్, రామచంద్రుడు, బుద్ధుడు ,గోపాల్, సుమంత్, నాగేశ్వరావు, రామ్మోహన్, మధు, సురేష్, జయన్న, మధుమోహన్, మహేంద్ర, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల పట్ల ఆప్యాయతగా ఉండాలి

కొత్తపల్లి : విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రేమానురాగాలు చూపుతూ ఆప్యాయతగా ఉండాలని ఎంపీడీవో మేరీ, ఈవోఆర్‌డి శ్రీనివాసులు నాయుడు తెలిపారు. బుధవారం కొత్తపల్లిలోని కస్తూరిబా గాంధీ బాలికల వసతి గృహాన్ని వారు తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం వంట నిర్వాహకులు ప్రభుత్వ మెనూ ప్రకారం ఇవ్వాలన్నారు. అలాగే జెడ్డువారిపల్లి గ్రామంలో మండల 15 ఫైనాన్స్ నిధులు 6 లక్షలతో స్మశానానికి పలు కాలనీలో వేస్తున్న గ్రావెల్ రోడ్డును పరిశీలించారు. రోడ్డు నాణ్యత ప్రమాణాలు పాటించి వెయ్యాలన్నారు. వీరి వెంట పంచాయతీరాజ్ ఏఈ రామచంద్రయ్య పలువురు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ఉయ్యాలవాడ : గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గోల్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఆయా గ్రామాల కార్యకర్తలు, వాలంటీర్లు, గృహసారధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ నుండి మనం మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం ప్రారంభించాలన్నారు ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకుని స్టిక్కర్లు అందించాలన్నారు. అనంతరం ప్రజల అభిప్రాయాలు సేకరించాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్ రెడ్డి, నాయకులు గురు ప్రసాద్ రెడ్డి, దండి ఆదినారాయణ రెడ్డి, గజ్జల కృష్ణారెడ్డి, ఆరికట్ల శివరామ కృష్ణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గురెడ్డి కందుల వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

నందికొట్కూరు : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే తోగురు ఆర్థర్ పేర్కొన్నారు. బుధవారం నందికొట్కూరు పట్టణంలోని4వ సచివాలయం గాంధీనగర్ పరిధిలో రెండవ రోజు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి లబ్ధిదారునికి అందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మొల్ల రబ్బాని, కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్, మున్సిపల్ కమిషనర్ పి.కిషోర్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ హాజీ అబ్దుల్ శుకూర్, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ గంగిరెడ్డి రమాదేవి, నందికొట్కూరు వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ సగినేల ఉసేనయ్య, వైసిపి నాయకులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. మండలంలోని ఇందిరేశ్వరం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సర్పంచి నారాయణరెడ్డి. వైసిపి మండల అధ్యక్షుడు రాజమోహన్ రెడ్డి. తహశీల్దార్ ప్రకాష్ బాబు, ఎంపీడీవో మోహన్ కుమార్, ఎఒ విష్ణువర్ధన్ రెడ్డి. ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగేశ్వరి. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. **నంద్యాల రూరల్ :** గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నంద్యాల మండలంలోని కానాలలో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పర్యటించారు. స్థానిక ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు.


ఆత్మకూరు : ఇందిరేశ్వరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా